

నేడు, రేపు రిజిస్ట్రేషన్లు

విశాఖపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఆదివారం (ఉగాది), సోమవారం (రంజాన్) సెలవులైనప్పటికీ కూడా పనిచే స్తాయని రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ బాలకృష్ణ శనివారం తెలిపారు. మంచి రోజులు కావడంతో చాలామంది సిర్థాస్తుల లావాదేవీలు పూర్తి చేసుకునే అవకాశం ఉన్నందున సబ్ రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రార్, డీఐజీ కార్యాలయాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సేవలు అందించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకోవాలని కోరారు.

పత్రికా పఠనంతో ప్రపంచ జ్ఞానం

- నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ
- ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో పేపర్ చదవాలని సూచన
- వినూత్న ఒరవడితో ముందుకు సాగుతున్న 'ఆంధ్రజ్యోతి'
- 'సీఎంఆర్' గ్రూపు అధినేత మావూరి వెంకటరమణ
- పాఠకులను ప్రోత్సాహకాలు అందజేయడం గొప్ప విషయం
- 'ఐకానిక' ప్రాజెక్టు మార్కెటింగ్ హెడ్ అవినాష్‌వర్మ
- ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్ లక్కీడ్రా విజేతల ఎంపిక
- లక్కీడ్రా ద్వారా 'ఆంధ్రజ్యోతి' 'కార్ అండ్ బైక్ రేస్' విజేతల ఎంపిక



లక్కీడ్రా విజేతల వివరాలు - 10వ పేజీలో

'ఆంధ్రజ్యోతి' 'కార్ అండ్ బైక్ రేస్' యూనిట్ స్థాయి లక్కీ డ్రా విజేతలను ఎంపిక చేస్తున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, ఐకానిక ప్రాజెక్ట్స్ మార్కెటింగ్ హెడ్ అవినాష్‌వర్మ, చిత్రంలో సర్క్యులేషన్ డైరెక్టర్ కె.రామకృష్ణారావు, బ్రాంచ్ మేనేజర్ కె.రామకృష్ణారావు, వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది ఉన్నారు.

విశాఖపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పత్రికా పఠనంతో ప్రపంచ జ్ఞానం లభిస్తుందని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని పాఠకులకు కోటి రూపాయల విలువైన బహుమతులను అందించేందుకు 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన 'కార్ అండ్ బైక్ రేస్' యూనిట్ స్థాయి లక్కీ డ్రా కార్యక్రమం శనివారం సాయంత్రం అక్కయ్యపాలెంలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నగర పోలీస్ కమిషనర్ లక్కీ డ్రా ద్వారా ప్రథమ బహుమతి విజేతను ఎంపిక చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ పేపర్ చదవడం ద్వారా జ్ఞానం పెరుగుతుందని, చుట్టుపక్కల జరిగే విషయాలు కూడా తెలుస్తాయన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు పేపర్ పఠనం ఎంతో ఉపకరిస్తుందన్నారు. ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో పేపర్ చదవాలని సూచించారు. పేపర్ చేతితో పట్టుకుని చదివితేనే ఆ అనుభూతి వేరన్నారు. 'ఆంధ్రజ్యోతి' మంచి పేపర్ అని ప్రశంసించారు. మరో అతిథి సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ ... మిగతా 8వ పేజీలో

గ్రేటర్ బడ్జెట్ రూ. 4,601.4 కోట్లు

ఏకగ్రీవంగా ఆమోదించిన కౌన్సిల్

- సమావేశం నిర్వహణలో జాప్యానికి నైతిక బాధ్యత వహిస్తూ మేయర్ రాజీనామాకు కూటమి సభ్యుల పట్టు





జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు గొల్లబాబూరావు కలెక్టర్‌పై చేసిన వ్యాఖ్యలపై వాగ్వాదం చేస్తున్న కూటమి కార్పొరేటర్లు

ఆదాయ, వ్యయాలు..

ఆదాయం ఇలా...

సాధారణ పద్దు	రూ.106.67 కోట్లు
ఇంజనీరింగ్	రూ.560.21 కోట్లు
ప్రాజెక్టులు	రూ.560 కోట్లు
టౌన్‌ప్లానింగ్	రూ.312.26 కోట్లు
యూసీడీ	రూ.15 కోట్లు
పార్కులు	రూ.20 కోట్లు
ప్రజారోగ్యం	రూ.22.59 కోట్లు
నీటి సరఫరా	రూ.438.8 కోట్లు
అమృత్	రూ.300 కోట్లు
విదేశీ సహకారంతో చేపట్టే ప్రాజెక్టులు	రూ.148 కోట్లు
ఆర్థిక సంఘం నిధులు	రూ.450 కోట్లు
డిపాజిట్లు అడ్వాన్సులు	రూ.386.04 కోట్లు
మొత్తం ఆదాయం..	రూ.4,279.61 కోట్లు

ఖర్చులు ఇలా...

సాధారణ పద్దు	రూ.158.02 కోట్లు
ఇంజనీరింగ్	రూ.1319.45 కోట్లు
లైటింగ్	రూ.116.15 కోట్లు
ప్రాజెక్టులు	రూ.808.14 కోట్లు
టౌన్‌ప్లానింగ్	రూ.31.99 కోట్లు
యూసీడీ	రూ.27.54 కోట్లు
విద్య	రూ.4.7 కోట్లు
పార్కులు	రూ.84.6 కోట్లు
ప్రజారోగ్యం	రూ.459.49 కోట్లు
నీటి సరఫరా	రూ.338.93 కోట్లు
అమృత్	రూ.310 కోట్లు
విదేశీ సహకారంతో చేపట్టే ప్రాజెక్టులు	రూ.148 కోట్లు
ఆర్థిక సంఘం నిధులు	రూ.453.2 కోట్లు
డిపాజిట్లు అడ్వాన్సులు	రూ.341.19 కోట్లు
మొత్తం ఖర్చులు	రూ.4,601 కోట్లు

- రెండు నెలలైనా కమిషనర్‌ను నియమించలేకపోయినందుకు టీడీపీ కార్పొరేటర్ల రాజీనామాకు వైసీపీ డిమాండ్
- వాస్తవానికి భిన్నంగా బడ్జెట్‌ను రూపొందించారని వామపక్షాల కార్పొరేటర్లు విమర్శ

విశాఖపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26) రూ.4,601.4 కోట్లతో రూపొందించిన బడ్జెట్‌ను మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) కౌన్సిల్ శనివారం ఏకగ్రీవంగా ఆమోదించింది. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన బడ్జెట్ సమావేశం జరిగింది. సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభించాల్సి ఉండడంతో మేయర్ ఆ సమయానికి కౌన్సిల్ హాల్‌కు చేరుకున్నారు. అయితే అప్పటికి కూటమి నుంచి 29 మంది, సీపీఎం, సీపీఐ నుంచి ఒక్కొక్కరు, వైసీపీ నుంచి ఇద్దరు డిప్యూటీ మేయర్లు మాత్రమే హాజరవ్వడంతో సమావేశం ప్రారంభించడానికి అవసరమైన కోరం పరిశీలించాలని కార్యదర్శిని ఆమె ఆదేశించారు. 28 మంది ఉంటే సరిపోతుందని, మరో ఐదుగురు ఎక్కువగానే ఉన్నారని కార్యదర్శి చెప్పడంతో మేయర్ సమావేశాన్ని ప్రారంబిస్తున్నట్టు ప్రకటించారు. ఆ సమయంలో టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, లేళ్ల కోటేశ్వరరావు, తదితరులు కలుగజేసుకుని జనవరి పదో తేదీలోపు ... మిగతా 9వ పేజీలో

ఐపీఎల్ సందడి

నేడే ఢిల్లీ క్యాపిటల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య మ్యాచ్

- కీలక సమరానికి వేదికగా ఏసీఏ-వీడీసీఏ స్టేడియం
- 'సన్‌రైజర్స్'లో ప్రత్యేక ఆకర్షణగా లోకల్ బాయ్ నితీష్‌కుమార్‌రెడ్డి, ఇషాన్ కిషన్
- ఢిల్లీ క్యాపిటల్స్‌లో అశుతోష్‌శర్మ





కేఎల్ రాహుల్ బ్యాటింగ్



అక్షర్‌పటేల్ బౌలింగ్ ప్రాక్టీస్



నితీష్‌కుమార్‌రెడ్డి

విశాఖపట్నం-స్పోర్ట్స్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): క్రీడాభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య ఐపీఎల్ మ్యాచ్‌కు మరికొద్ది గంటల్లో ప్రారంభం కానున్నది. ఇందుకు పీఎం పాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.

ఈ సీజన్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో అనూహ్య విజయంతో శుభారంభం చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లు...హోం గ్రౌండ్‌లో ఆదివారం జరిగే రెండో మ్యాచ్‌లో కూడా గెలుపొందాలనే పట్టుదలతో ఉన్నారు. ఇక టైటిల్ ఫేవరెట్ జట్లలో ఒకటిగా నిలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్...తొలి మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై విజయం సాధించి, రెండో మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ చేతిలో ఓటమి పాలైంది. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై విజయం సాధించడమే లక్ష్యంగా బరిలో దిగుతోంది.

ఆకర్షణగా నితీష్, ఇషాన్, అశుతోష్

సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో లోకల్ బాయ్ నితీష్‌కుమార్‌రెడ్డి, తొలిమ్యాచ్‌లో ... మిగతా 8వ పేజీలో

నలుగురికి కళారత్న అవార్డులు

పది మందికి ఉగాది పురస్కారాలు



సుంకర చలపతిరావు



బీఎస్ రెడ్డి



సరస్వతి విద్యార్థి

విశాఖపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి అవార్డులు ప్రకటించింది. విశాఖపట్నానికి చెందిన నలుగురికి కళారత్న అవార్డులు, మరో పది మందికి ఉగాది పురస్కారాలు లభించాయి. కళారత్న అవార్డు కింద హంస ప్రతిమతో పాటు రూ.50 వేల నగదు ఇస్తారు. ఉగాది పురస్కారం లభించిన వారికి రూ.10 వేల నగదు అందజేస్తారు.

కళారత్న అవార్డు పొందిన వారిలో బీఎస్ రెడ్డి (మేజిక్), సుంకర చలపతిరావు (కళా విమర్శకులు, పెయింటింగ్), ప్రొఫెసర్ ... మిగతా 8వ పేజీలో

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



తెలుగుదేశం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, తదితరులు - వార్త 9వ పేజీలో...

మధురవాడలో స్పోర్ట్స్ ఎరీనా

- మాస్టర్ ప్లాన్ రహదారులకు రూ.103.43 కోట్లు
- వీఎంఆర్‌డీఏ పార్కులో 15 అడుగుల ఎన్‌టీఆర్ కాంస్య విగ్రహం
- వీఎంఆర్‌డీఏ బోర్డు సమావేశంలో నిర్ణయం

విశాఖపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మధురవాడలో మూడు ఎకరాల విస్తీర్ణంలో ఒలింపిక్స్ ప్రమాణాలతో అవుట్‌డోర్ స్పోర్ట్స్ ఎరీనా నిర్మించాలని శనివారం జరిగిన వీఎంఆర్‌డీఏ బోర్డు సమావేశంలో నిర్ణయించారు. ఇంకా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

- బీచ్‌రోడ్డులో ఉన్న వీఎంఆర్‌డీఏ పార్కులో 15 అడుగుల ఎన్టీఆర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని చైర్మన్ ప్రణవ్‌గోపాల్ ప్రతిపాదించగా అధికారులు ఆమోదించారు.
- మాస్టర్ ప్లాన్ రహదారుల పనులు రూ.103.43 కోట్లతో చేపట్టాలని నిర్ణయించారు.
- అనకాపల్లిలో రావుగోపాలరావు కళాక్షేత్రాన్ని అభివృద్ధి చేయనున్నారు.
- చీమలాపల్లి, ఎండాడలలో నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్లకు నిర్మాణ వ్యయం పెరిగిందని ఇంజనీరింగ్ అధికారులు పేర్కొనగా, వాటికి అదనపుమొత్తాలు మంజూరుచేశారు.
- కాకాని నగర్‌లో రూ.12.5 కోట్లతో అండర్ పాస్ నిర్మాణానికి పచ్చజెండా ఊపారు.
- సిరిపురంలోని ఉద్యోగ భవన్ వెనుక ఉన్న 98 సెంట్ల ఖాళీ స్థలంలో రూ.99 కోట్లతో సెల్ఫ్ సస్టెయినబుల్ ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. సమావేశంలో చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు మంత్రి నారా లోకేశ్ రాక



విశాఖపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం నగరానికి రానున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 1.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. విమానాశ్రయం నుంచి పీఎం పాలెం క్రికెట్ స్టేడియానికి వెళ్లి ఐపీఎల్ మ్యాచ్ తిలకిస్తారు. మ్యాచ్ ముగిసిన అనంతరం రాత్రి 7.40 గంటలకు టీడీపీ కార్యాలయానికి చేరుకుని అక్కడ బస చేస్తారు. ఈనెల 31వ తేదీ ఉదయం బీచ్ రోడ్డులో శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం అనకాపల్లి జిల్లా ఎలమంచిలి నియోజకవర్గానికి వెళతారు. రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.13 (ఆదివారం సాయంత్రం)
సహర్ : 4.35 (సోమవారం ఉదయం)

నేడు, రేపు ఆస్తిపన్ను చెల్లింపునకు అవకాశం

విశాఖపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సెలవు దినాలైనప్పటికీ ఆది, సోమవారాల్లో ఆస్తిపన్ను చెల్లించేందుకు నగరవాసులకు అవకాశం కల్పిస్తున్నట్టు జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తిపన్ను చెల్లింపునకు ఈనెల 31 ఆఖరు తేదీ కావడంతో ప్రజల వెసులుబాటు కోసం ఈ ఏర్పాటు చేశామన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సౌకర్యం కేంద్రంతోపాటు అన్ని జోనల్ కార్యాలయాల్లోని సౌకర్యం కేంద్రాల్లో పన్ను చెల్లించవచ్చునన్నారు. ఆస్తిపన్ను, వీఎల్‌టీ బకాయిలు ఉన్నవారు ఈనెల 31లోగా మొత్తాన్ని చెల్లిస్తే వడ్డీపై 50 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు.

పారిశుధ్య కార్మికులకు సెలవు రద్దు

నగర పరిశుభ్రతను దృష్టిలో పెట్టుకుని ఆది, సోమవారాల్లో పారిశుధ్య కార్మికులకు సెలవు రద్దు చేసినట్టు జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఐ.నరేష్ తెలిపారు. క్లాప్ వాహనాలు ఇంటింటికీ వచ్చి చెత్తను సేకరిస్తాయన్నారు.

దుశ్చర్య

- గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఓ అపార్టుమెంట్ సెల్లార్‌లో 13 ద్విచక్ర వాహనాలు దహనం
- అక్కడ నివసిస్తున్న కుటుంబానికి త్రుటిలో తప్పిన ప్రాణాపాయం



కాలిపోయిన వాహనాలు

మహారాణిపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): దుండగుల దుశ్చర్యతో ఓ అపార్టుమెంట్ సెల్లార్‌లో 13 ద్విచక్ర వాహనాలు దహనమయ్యాయి. సెల్లార్‌లో నివాసం ఉంటున్న కుటుంబం త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది. వారి ఇంట్లోని వస్తువులు కూడా కాలిపోయాయి. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగ్ హోటల్ డౌన్ విశ్వనాథం రోడ్డులో శనివారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో జరిగిన ఈ ఘటన స్థానికంగా సంచలనం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం..విశ్వనాథం రోడ్డులో ఇటీవల నిర్మించిన అపార్టుమెంట్‌లో సుమారు 12 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వారి ద్విచక్ర వాహనాలను (పార్కింగ్) అపార్టుమెంట్ లోపలే పెట్టుకుంటారు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున ద్విచక్ర ... మిగతా 8వ పేజీలో

అప్పన్న సేవలకు రూ. 3 లక్షల విరాళం

సింహాచలం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన మార్గాన కూర్మారావు తన సతీమణి పేరున అప్పన్న స్వామి సేవలకు రూ. 3 లక్షలు విరాళంగా అందించారు. విరాళం మొత్తాన్ని దేవాలయ ప్రోటోకాల్ విభాగం పర్యవేక్షణాధికారి సీవీవీ పద్మనాభరాజు (విక్రమ్)కు శనివారం ఆయన చెక్ రూపంలో అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయ దర్శనం కల్పించి, శేషవస్త్రంతో సత్కరించి, ప్రసాదాలు అందజేశారు.

భైరవస్వామికి అభిషేకాలు

సింహాచలం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అనుబంధ ఆలయం భైరవస్వామికి భక్తులు శనివారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ప్రతి నెలలో వచ్చే ఆఖరి అమావాస్య నాడు భక్తులు భైరవస్వామిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఈమేరకు శనివారం వేకువజాము నుండే వందలాది మంది ఆలయానికి తరలి వచ్చి స్వామివారికి పంచామృతాలు, పవిత్ర జలాలతో పూజలు, అభిషేకాలు జరిపారు.

ఐదో వార్డులో సమస్యలపై వినతి

కొమ్మాది, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 5వ వార్డులోని పలు సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ మొల్లి హేమలత కోరారు. శనివారం ఆమె జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను కౌన్సిల్ సమావేశంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులోని పలు కాలనీల్లో యూజీడీ సమస్య అధికంగా ఉందని, కొండవాలు ప్రాంతాల్లో తాగునీటి సదుపాయం, వీధిలైట్లు లేవన్నారు. సాయిరాం కాలనీ, పరదేశిపాలెం, బోరవాని పాలెంలో శ్మశానవాటికలను అభివృద్ధి చేయాలని విన్నవించారు.

గీతంలో ఉగాండా విద్యార్థుల సమావేశం

సాగర్‌నగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : గీతం వర్సిటీలో రెండు రోజుల పాటు ఉగాండా విద్యార్థుల సంఘం (అసోసియేషన్ ఆఫ్ ఉగాండా స్టూడెంట్స్ ఇన్ ఇండియా) రాష్ట్ర స్థాయి సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలకు గీతం వర్సిటీతో పాటు ఏయూ, కేఎల్‌యూ తదితర విశ్వవిద్యాలయాల నుంచి ఉగాండా విద్యార్థులు, న్యూఢిల్లీలోని ఉగాండా హైకమిషన్ కార్యాలయం నుంచి ఉన్నత స్థాయి ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో పలు అంశాలపై చర్చించారు. అనంతరం గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు ఉగాండా ప్రతినిధులతో జరిగిన సమావేశంలో గీతంలో విదేశీ విద్యార్థులకు కల్పిస్తున్న ప్రత్యేక సౌకర్యాలు, విద్యా, సాంస్కృతిక తదితర వాటి గురించి వివరించారు.

ప్రతి భూమి రీసర్వే : తహసీల్దార్



మాట్లాడుతున్న తహసీల్దార్

పద్మనాభం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులంతా తప్పనిసరిగా భూములను రీసర్వే చేసుకోవాలని తహసీల్దారు కె. ఆనందరావు అన్నారు. శనివారం ఆయన ఆయన తన కార్యాలయంలో వీఆర్‌ఓలు, సర్వే సహాయకులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి రైతు భూమిని చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులంతా సమన్వయంతో పని చేయాలని సూచించారు.2వ తేదీ నుంచి పాండ్రంగి, కొవ్వాడ గ్రామాల్లో రీసర్వే చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి డివిజన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కనకబాబు, డీటీలు చంద్రశేఖర్, వరలక్ష్మి, సర్వేయర్ రామకృష్ణ, ఆర్ఐ శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై అమావాస్య పూజలు

సింహాచలం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనరసింహస్వామికి ఫాల్గుణ మాస బహుళపక్ష అమావాస్య పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం రాజభోగం నివేదన వేళ చక్ర పెరుమాళ్‌ను పల్లకిలో ఉంచి మాడవీధుల్లో తిరువీధి జరిపారు. సాయంత్రం ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో పూల మాలికలు, స్వర్ణాభరణాలతో అలంకరించి మాడవీధుల్లో తిరువీధి ఉత్సవం వైభవంగా జరిపారు.

'అవంతి'లో ముగిసిన యువజనోత్సవాలు

తగరపువలస, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస సమీపంలో ఉన్న అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న అవెన్సిస్ 2కె 25 యువజనోత్సవాలు శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా విద్యా సంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు, పాటలు కూడా అవసరమన్నారు. వాటి వల్ల శరీరానికి, మనసుకు ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. అనంతరం దామోదర సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి. సూర్యప్రకాశ్‌రావుతో కలిసి ఆయన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ శ్రీభరత్‌కు జ్ఞాపిక అందిస్తున్న టీడీపీ నాయకులు



అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, తదితరులు

ఉత్సవ సందడి

- భీమిలిలో ఘనంగా నూకాలమ్మ ఉత్సవాలు
- భారీ ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు

భీమునిపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నూకాలమ్మ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. వందలాది మంది భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఎంపీ శ్రీభరత్, ఇతర నాయకులు శనివారం అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఈవో మురళీమోహన్ స్వాగతం పలికారు. పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున ఆలయ వంశపారంపర్య పూజారులు చౌదరి సత్యరాజు, వెంకటేశ్, మారుతి తొలి పూజ నిర్వహించారు. అనంతరం పేరంటాలు పాపమ్మ మహోత్సవం, కొత్త అమావాస్య ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అల్లిపిల్లి వేణుబాబు, ప్రధాన కార్యదర్శి యెచ్చర్ల హరి, కమిటీ సభ్యులు పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, పాసి వినోద్‌కుమార్, గొరపల్లి సన్యాసిరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, గాడు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డులోని పాత అడివివరం, అంబేడ్కర్ కాలనీ, సింహాచలనగర్, గోశాల, సింహగిరి నిర్వాసితుల కాలనీల్లోని నూకాలమ్మ ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు కుంకుమ, చీరలు చూపి మొక్కులు చెల్లించుకున్నారు.



మధురవాడలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు



పరదేశిపాలెం వద్ద ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పిస్తున్న నేతలు



సింహాచలంలో జరిగిన వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు

వాడవాడలా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

భీమునిపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. భీమిలి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ పార్టీ పతాకాన్ని ఎగురవేసి, ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సీనియర్ నాయకులు చిలకా నరసింగరావు,చురకల రమణ, పాసి నరసింగరావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, గొలగాని నరేంద్రకుమార్, పిట్టా సురేశ్, త్రినాథ్‌కుమార్, గరికిన కింగ్ పాల్గొన్నారు.

మధురవాడ : మధురవాడలో టీడీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం కార్యదర్శి నాగోతి సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఏడో వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, వార్డు టీడీపీ అధ్యక్షుడు పిళ్లా నరసింగరావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మధురవాడ పీహెచ్‌సీ ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి నాగోతి శివాజీ, వార్డు కార్యదర్శి కానూరి అచ్చుతరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి దుర్గారావు, నాయకులు పోతిన ప్రసాద్, కలివేల్పు సూరిబాబు, పోతిన బాలాజీ, నాగోతి సత్యనారాయణ, పోతిన నాయుడు, బుజ్జి, భవానీ, సురేశ్, హసీనా పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని 22 పంచాయతీల్లోనూ పార్టీ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. పంచాయతీల్లో గ్రామ అధ్యక్షులు, సీనియర్ నాయకులు పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కె. రమణ, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామోదరరావు, సీనియర్ నాయకులు కె. నగేష్ కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, ఆర్ఎస్ మూర్తి, నందీశ్వరరావు, శ్రీను పాల్గొన్నారు.

విశాలాక్షినగర్ : జీవీఎంసీ 9వ వార్డు చలపతినగర్‌లో వార్డు అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అలానే జోడుగుళ్లపాలెం కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళి అలర్పించారు. కార్యక్రమంలో నాయకులు బుడుమూరి గోవింద్, చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది : టీడీపీని స్థాపించి, 43 ఏళ్లు పూర్తయ్యాయని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని పరదేశిపాలెం జాతీయ రహదారి దరి వద్ద ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహానికి ఆమె పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మొల్లి లక్ష్మణరావు, వార్డు అధ్యక్షుడు నాగోతి సత్యనారాయణ,బోయి శ్రీను, రమాదేవి, ఈగల రవి, కొండపు రాజు పాల్గొన్నారు. పీఎంపాలెం క్రికెట్ స్టేడియం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్, ఆరో వార్డు పార్టీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత విశాఖ ఉపాధ్యక్షుడు గరే గురునాథ్,రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు గొల్లంగి ఆనందబాబు, రెడ్డి సత్యనారాయణ, పోలిశెట్టి నాగేశ్వరరావు, లొడగల జానకీరామ్, షేక్ సుభాని పాల్గొన్నారు.కాగా వైఎస్సార్ కాలనీలో టీడీపీ నాయకుడు ఓలేటి శ్రావణ్ ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్ విగ్రహాన్ని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత శనివారం రాత్రి ఆవిష్కరించారు. అనంతరం ఆమె సీనియర్ కార్యకర్తలను సన్మానించారు.

సాగర్‌నగర్ : సాగర్‌నగర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి, కార్పొరేటర్ అప్పారావు, నాయకులు దొరబాబు, సారిపల్లి శ్రీనివాసరావు, శతపతి మంగాదేవి, ఒమ్మి బాబూరావు, దువ్వి పరమేశ్వరరావు, బొద్దు శ్రీనివాసరావు, సన్యాసిరావు పాల్గొన్నారు.

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డులో త్వరలో ఎన్‌టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయనున్నట్టు కార్పొరేటర్ పీవీ నరసింహం తెలిపారు. సింహాచలం ప్రధాన కూడలిలో ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పట్నాల ధర్మరాజు, సిరిపురపు సురేష్, మేక కాసుగోపాల్, సత్యారావు, తాలాడ రామారావు, మజ్జి చంద్ర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని వేములవలసలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్ రాజు, కొట్యాడ నారాయణరావు, అంగటి రాము, గుండు చిన్న, పడాల అప్పలనాయుడు, కర్రోతు సత్యన్నారాయణ, కొట్యాడ రెడ్డిబాబు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రం నిర్వహణపై శిక్షణ



ఆనందపురం : కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఓ శ్రీనివాసరావు

ఆనందపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లంకి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్, గ్రీన్ గార్డులకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి ఎమ్‌పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ తడి, పొడి చెత్త సేకరణలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. పరిసరాల పరిశుభ్రతతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, ఆ దిశగా సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సత్యన్నారాయణ, స్థానిక సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్న : ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఈఓపీఆర్‌డీ కె. రమేష్‌నాయుడు అన్నారు. శనివారం ఆయన రేఖవానిపాలెం గ్రామంలో ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణపై పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించారు. ఘన వ్యర్థ పదార్థాలను ఏవిధంగా నిర్వహించాలన్నది వివరించారు. కార్యక్రమంలో రేఖవానిపాలెం, మూలకుద్దు సర్పంచ్ శ్రీనివాస్, కొయ్య రామకృష్ణ, ఎరబాల ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎల్ సందడి

... 7వ పేజీ తరువాయి

సెంచరీతో చెలరేగిన ఇషాన్ కిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. ఇటీవల ఆస్ట్రేలియాలో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో ఆసీస్‌పై అద్భుత సెంచరీ సాధించిన నితీష్ కుమార్...తొలిసారి సొంత గ్రౌండ్‌లో ఐపీఎల్ మ్యాచ్ ఆడనున్నాడు. ఈ నేపథ్యంలో క్రీడాభిమానులు అతనిపై అంచనాలు పెట్టుకున్నారు. ఇక ఢిల్లీ క్యాపిటల్స్ విషయానికి వస్తే తొలి మ్యాచ్‌లో వీరవిహారం చేసి జట్టుకు అద్భుతమైన విజయాన్ని అందించిన మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ అశుతోష్‌శర్మకు తోడు స్టబ్స్, డుప్లెసిస్, అభిషేక్ పోరల్ వంటివారు రాణిస్తే భారీ స్కోరు సాధించే అవకాశాలున్నాయి. ఈ మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ ఆడనున్నారు. మ్యాచ్ మధ్యాహ్నం 3.30 నుంచి ప్రారంభం కానుంది.

పిచ్‌పై అంచనాలు

ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలోని పిచ్ (వికెట్)పై 200కు పైగా స్కోరు వచ్చే అవకాశాలున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. అలాగే టాస్ కూడా కీలకం అవుతుందని భావిస్తున్నారు. ఈనెల 24 జరిగిన తొలి మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై తొలుత బ్యాటింగ్ చేసిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ 209 పరుగుల స్కోరు చేసింది. ఆదివారం జరిగే మ్యాచ్‌లో తొలి బ్యాటింగ్ చేసే జట్టు ప్రత్యర్థులకు 250 పరుగుల వరకు లక్ష్యాన్ని నిర్దేశించే అవకాశాలున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ముమ్మర సాధన

కీలక మ్యాచ్‌లో తలపడేందుకు ఇరుజట్ల ఆటగాళ్లు శనివారం ముమ్మర సాధన చేశారు. ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లు ఐదు రోజులుగా సాధన కొనసాగించగా, శుక్రవారం సాయంత్రం నగరానికి చేరుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాళ్లు శనివారం ఒక్కరోజు సాధన చేసే అవకాశం లభించింది.

ప్రభావం చూపని టికెట్ల ధర

దాదాపు 25 వేలకుపైగా సీటింగ్ సామర్థ్యం కలిగిన స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్, లఖనవూ జట్ల మధ్య ఈ నెల 24న జరిగిన తొలి మ్యాచ్‌కు 70 శాతం వరకూ సీట్లు నిండాయి. అయితే ఆదివారం జరిగే మ్యాచ్‌కు క్రీడాభిమానులు ఆసక్తి కనబరచడంతో శనివారం సాయంత్రానికి రూ.ఆరు వేల టికెట్లు మినహా మిగిలినవన్నీ పూర్తిగా అమ్ముడైపోయాయి.

ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు (అంచనా) : అక్షర పటేల్ (కెప్టెన్), మెక్‌గుర్క్, డుప్లెసిస్, అభిషేక్ పోరెల్, సమీర్ రిజ్వీ, ట్రిస్టన్ స్టబ్స్ అశుతోష్ శర్మ, విప్‌రాజ్ నిగమ్, మిచెల్ స్టార్క్, కులదీప్ యాదవ్, మోహిత్ శర్మ, ముకేష్‌కుమార్, కెఎల్ రాహుల్.

సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు (అంచనా) :కమిన్స్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, నితీష్‌కుమార్‌రెడ్డి, ఇషాన్ కిషన్, హెన్రిచ్, అనికేత్ వర్మ, అభినవ్ మనోహర్, జంపా, సిమ్రన్‌జీత్, హర్షల్ పటేల్, మహ్మద్ షమి.

పత్రికా పఠనంతో ప్రపంచ జ్ఞానం

... 7వ పేజీ తరువాయి

డ్రా ద్వారా ద్వితీయ బహుమతి విజేతను ఎంపిక చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్షరమే ఆయుధమంటూ వినూత్నమైన ఒరవడితో 'ఆంధ్రజ్యోతి' ముందుకు సాగుతోందన్నారు. సంక్రాంతి సమయంలో ముగ్గులు పోటీలు కూడా నిర్వహిస్తోందని, ఈ విధంగా పాఠకులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. లక్కీ డ్రాలో మూడో విజేతను ఎంపిక చేసిన ఐకానిక్ ప్రాజెక్ట్స్ మార్కెటింగ్ హెడ్ అవినాష్‌వర్మ మాట్లాడుతూ ప్రింట్ మీడియాలో ప్రముఖ సంస్థగా కొనసాగుతోన్న 'ఆంధ్రజ్యోతి' పాఠకులకు ప్రోత్సాహకాలను అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సర్క్యులేషన్ డైరెక్టర్ టి.రామకృష్ణారావు, బ్రాంచ్ మేనేజర్ కె.రామకృష్ణారావు,సిస్టమ్స్ మేనేజర్ ఎం.కిశోర్‌బాబు, ఎడిషన్ ఇన్‌చార్జి ఎల్.వి.రామాంజనేయులు, బ్యూరో ఇన్‌చార్జి యర్రా శ్రీనివాసరావు, సర్క్యులేషన్ ఇన్‌చార్జి బీవీవీ సత్యనారాయణ, అడ్వర్‌టైజ్‌మెంట్ ఇన్‌చార్జి శ్రీనివాసచక్రవర్తి, ప్రొడక్షన్ ఇన్‌చార్జి కుమార్, సీనియర్ స్టాఫ్ రిపోర్టర్లు ఆదినారాయణ, వెంకటరావు, పలు విభాగాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

భగవద్గీతపై అవగాహన

భీమునిపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : జీవన సమస్యల్లో చాలా వాటికి భగవద్గీత సమాధానం ఇస్తుందని ఇస్కాన్ సాధువు, అక్షయ పాత్ర ఫౌండేషన్ సభ్యుడు శ్యామ గోవింద దాసజీ అన్నారు. శనివారం ఆయన దాకమర్రిలో ఉన్న ఎన్ఎస్ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో జీవన సవాళ్లు భగవద్గీత మార్గాలు అన్న అంశంపై విద్యార్థులకు ఆధ్యాత్మిక సదస్సు నిర్వహించారు.

నేడు పంచాంగ శ్రవణం

సాగర్‌నగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలో ఉన్న మహాలక్ష్మి గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 6.30 నుంచి భక్తులకు సర్వదర్శనాలు కల్పించనున్నట్టు ఏఈఓ జగన్మోహనాచార్యులు తెలిపారు. ఉదయం 9 గంటలకు పంచాంగ శ్రవణం జరుగుతుందన్నారు.

నేడు ట్రాఫిక్ మళ్లింపు

- ఐపీఎల్ మ్యాచ్ నేపథ్యంలో అధికారుల నిర్ణయం
- స్టేడియం వద్ద 11 పార్కింగ్ స్థలాలు

మధురవాడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : పీఎంపాలెం ఏసీఏ వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్ సన్ రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య ఆదివారం మ్యాచ్ జరగనుండడంతో పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం వైపు నుంచి నగరంలోకి వచ్చే వాహనాలు శొంఠ్యాం, పెందుర్తి, ఎన్ఏడీ, టీసీపాలెం మీదుగా వస్తాయి. ఆర్‌టీసీ కాంప్లెక్సు నుంచి ఆనందపురం, విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే వాహనాలు టీసీపాలెం, ఎన్ఏడీ, పెందుర్తి, శొంఠ్యాం మీదుగా వెళ్తాయి. విజయనగరం, శ్రీకాకుళం నుంచి నగరంలోకి వచ్చే ఆటోలు, బైక్‌లు మారికివలస వద్ద ఎడమ వైపు తిరిగి జురాంగ్ జంక్షన్ మీదుగా తిమ్మాపురం చేరి బీచ్ రోడ్డు మీదుగా రుషికొండ, సాగర్‌నగర్, జోడుగుళ్లపాలెం మీదుగా ఆర్‌టీసీ కాంప్లెక్సుకు చేరుకోవాలి. శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం వైపు నుంచి నగరంలోకి వచ్చే కార్లు, బైక్‌లు, ఆటోలు కారుషెడ్ ముందు పెప్సీ వద్ద మలుపు తిరిగి మిధిలాపురి వుడాకాలనీ, ఎంవీవీ సిటీ, లా కాలేజీ మీదుగా పనోరమ హిల్స్‌కు చేరుకొని రుషికొండ మీదుగా నగరంలోకి చేరాల్సి ఉంది. నగరం నుంచి విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే బస్సులు, ఇతర కమర్షియల్ వాహనాలు హనుమంతవాక వద్ద ఎడమ వైపు తిరిగి బీఆర్‌టీఎస్ రోడ్డులో అడవివరం, నీలకుండీలు జంక్షన్ మీదుగా ఆనందపురం చేరుతాయి. నగరం నుంచి శ్రీకాకుళం, విజయనగరం వెళ్లే చిన్న వాహనాలు హనమంతవాక జంక్షన్ లేదా విశాఖ వేలీ జంక్షన్ మీదుగా మారికివలస హైవేకు చేరుతాయి.

పార్కింగ్ స్థలాలకు ఇలా వెళ్లాలి

వీవీఐపీ, వీఐపీ పాస్‌లు ఉన్న వారు వీవీఐపీ ఏ గ్రౌండ్ పి-1లో పార్కింగ్ చేయాలి. వీఐపీ వాహనాలను బి గ్రౌండ్‌లో పి-2 వద్ద, వీ కన్వెన్షన్ పి-3 వద్ద కూడా వీఐపీలు వాహనాలను నిలుపుకోవచ్చు. నగరం నుంచి వచ్చిన వారు ఎన్‌హెచ్ 16 వద్ద హోల్డ్ ఏజ్ హోం జంక్షన్ వద్ద ఎడమ వైపు తిరిగి సాంకేతిక ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్ వద్ద పి-4లో పార్కింగ్ చేయాలి. శ్రీకాకుళం, విజయనగరం నుంచి వచ్చిన వారు కారుషెడ్ జంక్షన్ వద్ద కుడి వైపు తిరిగి సాంకేతిక ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్‌కు చేరుకొని పి-4లో పార్క్ చేయాలి. మీడియా ప్రతినిధులు గేట్ నంబర్ 10, 11కు సమీపంలో ఉన్న వెంకటేశ్వరస్వామి గుడి వద్ద పి-5లో పార్కింగ్ చేయాలి. శ్రీకాకుళం, విజయనగరం నుంచి వచ్చే వారు పెప్సీ మలుపు వద్ద తిరిగి పోలిశెట్టి వేణుగోపాలరావు గ్రౌండ్ పి-6, ఎంవీవీ సిటీ డబుల్ రోడ్డు పి-7, బైక్‌లను జీవీఎంసీ పార్క్ పి-8, కళ్యాణ్‌కుమార్ సైట్ పి-9 వద్ద నిలిపివేయాలి. పోలీస్, రెవెన్యూ, ఇతర అధికారులు ఎంవీవీ బిల్డర్స్ అపార్ట్‌మెంట్ ముందు ఉన్న ఖాళీ స్థలంలో పి-10లో పార్కింగ్ చేయాలి. ఆర్టీసీ స్పెషల్ బస్సులు మారికివలస వద్ద ఎడమ వైపు తిరిగి తిమ్మాపురం రోడ్డు మీదుగా లా కాలేజీ వద్దకు చేరుకొని పి-11లో పార్కింగ్ చేయాలి. మ్యాచ్ అనంతరం సాంకేతిక కళాశాలలో పార్కింగ్ చేసిన వాహనదారులు విజేత సూపర్ మార్కెట్ మీదుగా కారుషెడ్‌కు వెళ్లి ఎన్‌హెచ్- 16కు చేరుకోవాలి. నగరంలోకి వెళ్లేవారు హోల్డేజ్ హోం జంక్షన్ నుంచి కుడి వైపు తిరిగి ఎండాడ మీదుగా నగరంలోకి చేరుకోవాలి.

వెంకన్నకు పుష్పాలంకరణ

మధురవాడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : కొత్త అమావాస్య పురస్కరించుకుని మధురవాడ నగరంపాలెం రోడ్డులో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారు, అమ్మవార్లను పలు రకాల పుష్పాలతో అలంకరించారు.

నేటి నుంచి సుందరకాండ పారాయణం

భీమునిపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మంగమారిపేట వారిజ ఆశ్రమంలో వసంత నవరాత్రుల్లో భాగంగా ఆదివారం నుంచి వారం రోజులు పాటు సుందరకాండ పారాయణం జరగనుంది. ప్రతిరోజూ ఉదయం 7 నుంచి 8.30 గంటల వరకూ ఈ కార్యక్రమం ఉంటుంది. అలాగే ఉగాది సందర్భంగా ఆశ్రమంలో పంచాంగ శ్రవణం నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు శ్రీకాంత్ శర్మ తెలిపారు.

దుశ్చర్య

... 7వ పేజీ తరువాయి

వాహనాల వద్ద హఠాత్తుగా మంటలు చెలరేగాయి. పెట్రోల్‌తో ఉన్న వాహనాలు కావడం, మంటలు పెద్దఎత్తున వ్యాపించడంతో అదే అపార్టుమెంట్ సెల్లార్‌లో ఆరుగురు సభ్యులతో నివసిస్తున్న కుటుంబం హాహాకారాలు చేసింది. మంటలు వారి ఇంటి లోపలకు వ్యాపించాయి. వారు వెనుక వైపు నుంచి బయటకు వచ్చి ప్రాణాలు దక్కించుకున్నారు. ఇంట్లోని వస్తువులు మాడిమసయ్యాయి. సమాచారం అందుకుని అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సుమారు ఇరవై రోజుల క్రితం ఇదే అపార్టుమెంట్‌కు చెందిన ఒక యువకుడి వాహనాన్ని కొందరు తగులబెట్టారు. అతను నూతన వాహనం కొను గోలు చేసి ఉగాది రోజు పూజ చేయించాలని అపార్టుమెంట్ పార్కింగ్‌లో పెట్టాడు. ఈ నేపథ్యంలో మళ్లీ ఆ యువకుడి వాహనాన్ని దహనం చేసేందుకు గుర్తుతెలియని వ్యక్తులు ప్రయత్నించి ఉంటారని, ఈ క్రమంలో వాహనాలన్నీ కాలిపోయి ఉంటాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు క్లూస్ టీమ్‌తో ఘటనా స్థలానికి వచ్చి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

నలుగురికి కళారత్న అవార్డులు

... 7వ పేజీ తరువాయి

సరస్వతి విద్యార్థి (కర్ణాటక వయలిస్ట్-సంగీతం),పాలగుమ్మి రాజగోపాల్ (సంగీతం) ఉన్నారు.

ఉగాది పురస్కారం పొందిన వారిలో కుప్పిలి పద్మ (సాహిత్యం), శిరేల సన్యాసిరావు (సాహిత్యం), డాక్టర్ బి. సత్యనారాయణ (సాహిత్యం), గుంటుకు వెంకటరావు (సంగీతం), డాక్టర్ ఆముక్త మాల్యాద (నృత్యం), డి.హేమ వేం కటేశ్వరి (నాటకం), కొల్లాబత్తుల విజయకుమార్ (మిమిక్రీ), బీఆర్ విక్రమ కుమార్ (జర్నలిజం), కనపర్తి రాణి (జర్నలిజం), ఎం.విజయ కుమార్ (పెయింటింగ్) ఉన్నారు.







మద్దిలపాలెం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 23వ వార్డులో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, సత్యారెడ్డి పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అలర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రి అయ్యాకే పేదలకు

రూ.2లకు కిలో బియ్యం, పించన్, జనతా వస్త్రాలు, పక్కా ఇల్లు వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. ఆయన తర్వాత చంద్రబాబు సారథ్యంలో పార్టీ మరింత పటిష్టపడడమే కాకుండా పేదలకు మేలు జరిగే కార్యక్రమాలు ప్రవేశపెడు

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం


మద్దిలపాలెం : ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కార్పొరేటర్ గుడ్ల విజయసాయి


ఎంవీపీ కాలనీ : 15వ వార్డులో టీడీపీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పార్టీ శ్రేణులు


ఆరిలోవ : పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ రామలక్ష్మీరాజశేఖర్


పెదవాల్తేర్ : చలివేంద్రం ప్రారంభిస్తున్న పట్టాభిరామ్, పోతన్న రెడ్డి తదితరులు

» ఎన్టీఆర్‌కు టీడీపీ నేతలు, కార్యకర్తల నివాళి
» పార్టీ పతాకం ఆవిష్కరణలు
» పలు చోట్ల సేవా కార్యక్రమాలు

తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పురుషోత్తం, అప్పలరెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

22వ వార్డులో..

స్థానిక 22వ వార్డులో టీడీపీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాప్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు

పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఒమ్మి అప్పారావు, దువ్వి స్వామి, నాగూర్‌బాబు, కోడిబోయిన ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పదిహేడో వార్డులో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం ఆధ్వర్యంలో పలువురు నేతలు, కార్యకర్తలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ జెండా ఎగురవేశారు. కార్పొరేటరు గేదెల నాగరాజు, టీడీపీ జిల్లా కార్యదర్శి నెక్కంటి సత్తిబాబు, నాయకులు కాళ్ల శంకర్, రాములమ్మ, గోపమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ : జీవీఎంసీ 10వ వార్డులోని రవీంద్రనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీరాజశేఖర్ .. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నటుడుగా, ప్రజాప్రతినిధిగా ఎన్టీఆర్ తెలుగు రాష్ట్రాలకు అందించిన సేవలను కొనియాడారు. ఎన్టీఆర్ సంక్షేమ పాలనకు ఆద్యుడిగా పేర్కొన్నారు. అలాగే క్లస్టర్ ఇన్‌చార్జి రాజేష్ తదితరులు ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించారు. రవీంద్రనగర్, ఆదర్శనగర్, సుందర నగర్, బీవీఎస్ఆర్ నగర్, ఇందిరా నగర్‌తదితర ప్రాంతాల్లో ఉన్న నందమూరి తారక రామారావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాలు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ 10వ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయడు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

పెదవాల్తేరులో..

పెదవాల్తేరు : జీవీఎంసీ 20వ వార్డు పరిధి పెదవాల్తేరు గాంధీబొమ్మ సెంటర్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్, వార్డు అధ్యక్షుడు బైరెడ్డి పోతన్నరెడ్డి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పి.వాసు, మద్ది శ్రీను, కాళ్ల శంకర్, చిన్నిపిల్లి రామిరెడ్డి, మరడ సితన్నరెడ్డి, సిహెచ్ జ్యోతి, మూర్తి గోవింద రెడ్డి, పి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే 21వ వార్డులో టీడీపీ వార్డు అధ్యక్షుడు పీతల అమరేంద్ర అధ్వర్యంలో చినవాల్తేరులోని హోమన హోటల్ సెంటర్‌లో గల ఎన్టీఆర్ విగ్రహానికి పలువురు టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తూర్పు నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు పీతల అవినాష్, వార్డు నాయకులు ప్రసాద్, చిన్న, మురళి, మూర్తి, ధర్మ, సురేష్, కనకరాజు, రమేష్, బొట్ట సాయి, వినోద్ మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ 17వ వార్డు చిన్నిపిల్లి వీధిలో చలివేంద్రాన్ని టీడిపి రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్, టీడీపీ సీనియర్ నాయకులు పోతన్న రెడ్డి, గేదెల నాగరాజు, కాళ్ల శంకర్, నరేంద్ర, రామిరెడ్డి తారక రెడ్డి తదితరులు చలివేంద్రాన్ని ప్రారంభించారు.

వెంకోజీపాలెంలో...

వెంకోజీపాలెం : జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురం కాలనీ, కొత్త వెంకోజీపాలెం, పాత వెంకోజీపాలెం, హెచ్‌బీ కాలనీ తదితర ప్రాంతాల్లో టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే 16వ వార్డు ఇసుకతోట ప్రాంతంలోని ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీడీపీ 15వ వార్డు అధ్యక్షుడు బుగత సత్యానారాయణ, ప్రధాన కార్యదర్శి, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, బోర ధనరెడ్డి, అప్పారి వెంకట గిరిబాబు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు సంపంగి గోవింద్, ఆడారి సూరిబాబు, అప్పలరాజు, కర్రి శ్రీను, వరలక్ష్మి, సోని తదితరులు పాల్గొన్నారు.

అలాగే 16వ వార్డులో నిర్వహించిన వేడుకల్లో టీడీపీ వార్డు అధ్యక్షుడు నారు గోపి, తూర్పు నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు పల్లా ఉమారాణి, మొల్లి శంకర్, మొల్లి శోభ, జి.అప్పన్న, ఎన్.కొండలరావు, ఆర్.భరత్‌కుమార్, కె.శ్రీను, ఎం.సత్యనారాయణ, ఎం.రవి, పైడిరాజు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నగర కార్యాలయంలో..


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గంటా శ్రీనివాసరావు, తదితర నేతలు

విశాఖపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అధ్యక్షతన తొలుత పార్టీ జెండాను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ ఎగురవేసి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగువారి గుండె చప్పుడు తెలుగుదేశం పార్టీగా అభివర్ణించారు. తెలుగువారి ఆత్మగౌరవం కోసం ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. సభ్యత్వ నమోదులో కోటి మార్కు దాటి టీడీపీ కొత్తరికార్డును సృష్టించిందన్నారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ ప్రజల కోసం, వారి అభ్యున్నతి కోసం అంకితభావంతో పనిచేస్తూ దేశ రాజకీయ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని టీడీపీ సాధించిందన్నారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ టీడీపీ వచ్చాకే బడుగు, బలహీన వర్గాలకు గుర్తింపు వచ్చిందన్నారు. గండి బాబ్జీ మాట్లాడుతూ దివంగత ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ దేశంలోనే చరిత్ర సృష్టించిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పార్టీ నేతలు పొలమరశెట్టి శ్రీనివాసరావు, వెల్లంకి భరత్, లొడగల కృష్ణ, ముత్యాలనాయుడు, పప్పు రాజారావు, ఈతలపాక సుజాత, తోటరత్నం, ఎ.మధుసూదనరావు, టి.విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పార్టీలో సీనియర్లు ఎం.వాసుదేవరావు, ఎస్.సుజాత,బి.వెంకటరమణ, ఎస్.రామారావు, ఎం.దేవుళ్లు, పి.నాగేశ్వరరావు, కె.వెంకటరావు,ఇ.వాసుదేవరావు, టి.చినదేముడు,వి.మోహనరావు, సీహెచ్ అప్పారావు, జె.కన్నబాబు, ఆర్.నారాయణ, ఎం.నిర్మలకుమారి, ఎస్.ఉమామహేశ్వరరావులనుసత్కరించారు.

సినిమా గైడ్

● **రాబిన్‌హుడ్** : జగదాంబ, శ్రీ లీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **మ్యాడ్2:** జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
● **పెళ్లికాని ప్రసాద్** : శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
● **కోర్ట్ :** జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
● **ఛావా :** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు(నలుపు) 28, బెండకాయలు 34, పచ్చిమిర్చి30, కాకరకాయలు 36, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 12, క్యారెట్ 26 దొండకాయలు 18, బంగాళ దుంపలు 15, అరటికాయ(పె)8, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది)50, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 54, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 48, కీరదోస 22, కాప్సికమ్ 36, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 60, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట)3, తోటకూర (కట్ట)3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	455
విజయనగరం	459
శ్రీకాకుళం	459

చికెన్ ధరలు బ్యాగ్	
రైతు ధర	104
లైవ్ ధర	124
విత్ స్కిన్	218
స్కిన్‌లెస్	228

తండ్రిపై బ్లేడుతో దాడి చేసి చంపిన తనయుడు

ఆరిలోవ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : కుమారుడు బ్లేడుతో గాయపరచడంతో తండ్రి మృతి చెందిన ఘటన ఆరిలోవ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించి ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

ఆరిలోవ రెండో సెక్టార్‌లో గల డ్రైవర్స్ కాలనీలో నివాసం ఉంటున్న పి.అప్పారావు తన చాదస్తంతో


మృతుడు అప్పారావు (ఫైల్‌ఫోటో)

భార్యను కుమారుడిని నిత్యం వేధిస్తూ మానసిక వేదనకు గురి చేసేవాడు. ఈ క్రమంలో శనివారం భార్యను తీవ్రంగా కొట్టాడు. కుమారుడు బాలయోగి పనికి ఎందుకు వెళ్లలేదంటూ దూషించాడు. ఈ నేపథ్యంలో కోపోద్రిక్తుడైన కుమారుడు బాలయోగి బ్లేడును తండ్రికి చూపించి దాంతో కోసివేస్తానంటూ బెదిరించాడు. దీంతో అప్పారావు కుమారుడిపై మరింతగా రెచ్చిపోగా, బాలయోగి తండ్రిపై బ్లేడుతో దాడి చేసి గాయపరిచారు. పెనుగులాటలో బ్లేడు గుండెపై తగలడంతో అప్పారావు తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే విమ్స్‌కు తరలించగా, వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్టు చెప్పారు. పంచనామా నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. తండ్రిపై దాడి చేసి ప్రాణాలు పోవడానికి కారణమైన కుమారుడు బాలయోగిని ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

గ్రేటర్ బడ్జెట్ రూ.4,601.4 కోట్లు

... 7వ పేజీ తరువాయి

ముగియాల్సిన బడ్జెట్ సమావేశాన్ని ఇంతవరకూ నిర్వహించకపోవడానికి కారణం చెప్పాలని డిమాండ్ చేశారు. దీనికి అదనపు కమిషనర్ (ఫైనాన్స్) ఎస్.ఎస్.వర్మ సమాధానం ఇస్తూ జనవరి మొదటి వారంలో నిర్వహించాలకున్నప్పటికీ...పీఎంనరేంద్రమోదీ పర్యటన, కమిషనర్ బదిలీ, ఎమ్మెల్సీ ఎన్నిక కోడ్ వంటి కారణాలతో సాధ్యపడలేదని వివరించారు. దీనికి జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ స్పందిస్తూ బడ్జెట్ సమావేశం నిర్వహించడంలో విఫలమైనందుకు నైతిక బాధ్యత వహిస్తూ మేయర్ గొలగాని హరివెంకటకుమారి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అందుకు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సమాధానం ఇస్తూ రాష్ట్రంలోనే అతిపెద్ద కార్పొరేషన్‌గా గుర్తింపుపొందిన జీవీఎంసీకి రెండు నెలలుగా కమిషనర్‌ను నియమించలేకపోయారని, దీనికి బాధ్యత వహిస్తూ టీడీపీ కార్పొరేటర్లు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై సభలో టీడీపీ సభ్యులు తీవ్రస్థాయిలో అభ్యంతరం తెలపడంతో గందరగోళం ఏర్పడింది. అదే సమయంలో ఇన్‌చార్జి కమిషనర్ హోదాలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ కౌన్సిల్‌హాల్‌లోకి రావడంతో సభ్యులంతా ఎవరి స్థానాల్లో వారు కూర్చున్నారు. అనంతరం మేయర్ హరివెంకటకుమారి బడ్జెట్ ముసాయిదాలోని అంశాలు, జీవీఎంసీకి వివిధ మార్గా ల ద్వారా వచ్చే ఆదాయం అంచనాలతోపాటు వివిధ విభాగాల ద్వారా చేసే ఖర్చులకు సంబంధించిన వివరా లను చదివి వినిపించారు. ఈ దశలో సీపీఐ కార్పొరేటర్ ఏజే స్టాలిన్ మాట్లాడుతూ బడ్జెట్ కేటాయింపుల్లో విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేశారని అసంతృప్తి వ్యక్తంచేశారు. సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు మాట్లాడుతూ బడ్జెట్‌ను పూర్తిగా అంకెలతో నింపేశారని, వాస్తవ ఆదాయం, ఖర్చులను పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. గత ఏడాది బడ్జెట్ కంటే గరిష్ఠంగా 20 శాతం మించి బడ్జెట్ అంచనాలు ఉండకూడదనే విషయాన్ని స్టాండింగ్ కమిటీ విస్మరించడం సరికాదన్నారు. ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ సమాధానం ఇస్తూ బడ్జెట్‌ను అంచనాల ఆధారంగానే రూపొందిస్తామని, ముందుగా తయారుచేసిన ముసాయిదాలో మరింత ఎక్కువ మొత్తం చూపించడంతో రూ.865 కోట్లు తగ్గించి ప్రస్తుత బడ్జెట్‌ను రూపొందించామని వివరించారు. 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత బడ్జెట్‌లో క్రీడలకు కేవలం రూ.15 కోట్లు మాత్రమే కేటాయించారని, ఆ మొత్తంతో నగర పరిధిలో క్రీడలను అభివృద్ధి చేయడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస్ మాట్లాడుతూ బడ్జెట్ గురించి మేయర్‌కు సరైన బాధ్యత లేకుండా పోయిందన్నారు. ముడసర్లోవలోని గుర్రాలపార్కు అంటే ఏదో బొమ్మలు పెడతారనుకుని కాంట్రాక్టర్‌కు రూ.3.5 కోట్లు చెల్లించేందుకు సంతకం చేసేశానని అంటారని ఎద్దేవా చేశారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జీవీఎంసీ ఆదాయాన్ని జీవీఎంసీయే ఖర్చు పెట్టుకునేందుకు వీలుగా సీఎఫ్ఎంఎస్‌ను పూర్తిగా రద్దు చేశారన్నారు. జీవీఎంసీ అభివృద్ధికి తోడ్పలేలా నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబుని అభినందిస్తూ కౌన్సిల్ తీర్మానం చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో సీఎఫ్ఎంఎస్‌లో రూ.170 కోట్లు, రిజిస్ట్రేషన్లపై సర్‌చార్జీల కింద రూ.110 కోట్లు ఇతర ప్రాజెక్టుల కింద రావాల్సిన బకాయిలు కలిపి రూ.570 కోట్లు ఉండిపోతే...వాటి విషయంలో కూటమి ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ తన కోటాలో త్వరలోనే రూ.పది కోట్లు నిధులు వస్తాయని, వాటిని నగర పరిధిలోనే ఖర్చు చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాల నిర్వహణలో జిల్లా కలెక్టర్ చట్టాన్ని పాటించడం లేదని, తనకు కనీసం నోటీసు కూడా ఇవ్వకుండానే సమావేశం పెట్టడం సరికాదన్నారు. తనకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సమాధానం ఇస్తూ చట్టబద్ధమైన కమిటీల సమావేశం పార్లమెంటు సమావేశాలతో నిమిత్తం లేకుండా నిర్వహించుకోవచ్చునన్నారు. తమ అధికారులు సమావేశానికి ఆహ్వానం పంపించినా, స్పందించలేదని వివరించారు. ప్రతి రోజూ ఉదయం తొమ్మిదిన్నర నుంచి రాత్రి తొమ్మిదిన్నర వరకు తాను కార్యాలయంలోనే ఉంటున్నానని, అపాయింట్‌మెంట్ లేకుండానే కలిసే వెసులుబాటు ఉంది కాబట్టి, ఎప్పుడైనా, ఎవరైనా వచ్చి కలవచ్చునన్నారు.

కళలకు కేంద్రంగా విశాఖను తీర్చిదిద్దాలి

» ఏపీ శాసనసభ ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు
» ముగిసిన జాతీయ నాటకోత్సవాలు
» 'వేటగాడు' సినిమా డైలాగ్స్‌తో ఉత్సాహం నింపిన ఉప సభాపతి


మాట్లాడుతున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, వేదికపై రఘురామకృష్ణంరాజు, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, రైటర్స్ అకాడెమీ చైర్మన్ రమణమూర్తి

మద్దిలపాలెం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : కళలకు కేంద్రంగా విశాఖ నగరాన్ని తీర్చిదిద్దాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉప సభాపతి కనుమూరి రఘురామకృష్ణంరాజు పేర్కొన్నారు. పిఠాపురంకాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో రైటర్స్ అకాడమీ నిర్వహిస్తున్న లీడర్ విశాఖ జాతీయ నాటకోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ మహాకవి గురుజాడ రాసిన 'కన్యాశుల్కం' నాటకం సమాజాన్ని ఎంతో జాగృతం చేసిందన్నారు. గురజాడతో పాటు మహాకవి శ్రీశ్రీ, రావిశాస్త్రి, ఘంటసాల ఉద్దండులు పుటినిల్లు ఉత్తరాంధ్ర అని పేర్కొన్నారు. కళలు, నాటకాలను ప్రోత్సహించడానికి రైటర్స్ అకాడమీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా.. రఘురామకృష్ణంరాజు 'వేటగాడు' చిత్రంలోని ఎన్టీఆర్ డైలాగులు చెప్పి ప్రేక్షకుల్లో ఉత్సాహం నింపారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ నాటక రంగం నుంచే గురజాడ, కందుకూరి వంటి వారు వచ్చి సంఘ సంస్కరణలు చేశారన్నారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆడిటోరియం ఏర్పాటు చేయాలని తరచూ రమణమూర్తి కోరుతున్నారని, స్పోర్ట్స్, కల్చరల్ నిర్వహించేలా 5 ఎకరాల్లో ఆడిటోరియం నిర్మాణం చేయడానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. సినీ నటులు ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ నాటక రంగం నుంచే మహానుభావులు వచ్చారని గుర్తు చేశారు. మహాభారతం, రామాయణం వంటి పురాణాలు కొందరికి పరిమితయ్యాయని, నాటక రంగం అందిరికీ చేరువైందన్నారు. అనంతరం హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, ఆర్.నారాయణమూర్తిలకు ఘనంగా సన్మానం చేసి జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా కేరళ కళాకారులు ప్రదర్శించిన 'ద టైగర్ మ్యాన్' నాటిక ఆకట్టుకుంది. నక్సలైట్లు, పోలీసులు, అటవీశాఖ అధికారుల మధ్య జరిగే మారణకాండ గిరిజనుల జీవనంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో కళ్లకట్టినట్టు చూపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, కళాభిమానులు పాల్గొన్నారు.


హోం మంత్రి అనితను సన్మానిస్తున్న వీవీ రమణమూర్తి

నకిలీ బంగారంతో బురిడీ!

సైబర్ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

సీతంపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లోని ఓ గోల్డ్ లోన్ సంస్థలో ఒకరు నకిలీ బంగారం తనఖా పెట్టి లక్షల రూపాయలు రుణం తీసుకున్నాడు. ఆ బంగారాన్ని అమ్మేస్తానంటూ మరొకరిని నమ్మించి గోల్డ్ లోన్ సంస్థకు అతడితో డబ్బులు కట్టించి వస్తువులు విడిపించి అతనికి ఇచ్చాడు. అతడు వాటిని పరిశీలించగా నకిలీ బంగారు ఆభరణాలుగా తేలింది. దీంతో బాధితుడు ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదగంట్యాడ బీసీ రోడ్డు దయాల్‌నగర్‌కు చెందిన పొదిలాపు జగదీశ్వరరావు బ్యాంక్‌లో తనఖా పెట్టిన బంగారం క్రయ విక్రయాలు చేస్తుంటాడు. గ్రాముపై రూ.100 లాభం తీసుకొని ఎవరైనా బ్యాంక్‌లో పెట్టిన బంగారు ఆభరణాలు విడిపించలేకపోతే కమీషన్ తీసుకుని ఆభరణాలు విడిపిస్తుంటాడు. ఈ క్రమంలో జగదీశ్వరరావు వద్దకు మార్చి 19న కర్రి గురుమూర్తి, త్రినాథ్ అనే వ్యక్తులు వెళ్లి తమ బంధువులు రూపిక్, కెనరా బ్యాంకులో బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టారని తెలిపారు. తమకు కొంత కమీషన్ ఇచ్చి తనఖా పెట్టిన బంగారాన్ని విడిపించాలని జగదీశ్వరరావును కోరారు. ఈ నేపథ్యంలో ద్వారకా నగర్‌లో గల రూపిక్ బ్యాంక్‌కు అతనిని తీసుకువెళ్లారు. అక్కడ వారి బంధువులు ఈశ్వరరావు, మోహనరావు, రాఘవేంద్ర, రాజు అనే వారు ఉన్నారు. తనఖా పెట్టిన బంగారు ఆభరణాలు ఇవ్వడానికి రూ.68,51,300 కట్టాలని రూపిక్ బ్యాంక్ మేనేజర్ వర్మ కోరారు. డబ్బులు చెల్లించే ముందు బంగారు ఆభరణాలు తనిఖీ చేయాలని జగదీశ్వరరావు అభ్యర్థించాడు. అయితే బంగారం రామ్‌నగర్‌లోని ఫెడరల్ బ్యాంక్ లాకర్‌లో ఉందని, డబ్బు మొత్తం చెల్లించకుండా ఆభరణాలు చూపించేది లేదని రూపిక్ బ్యాంక్ మేనేజర్ తెలిపారు. కెనరా బ్యాంక్ నుంచి టేకోవర్ లోన్ కాబట్టి బంగారం నిస్సందేహంగా స్వచ్ఛమైనదని అప్రైజర్ వివరించాడు. లేకుంటే దానిని రుణానికి పూచీకత్తుగా అంగీకరించేవారు కాదని తెలిపారు. ఈ క్రమంలో రూపిక్ బ్యాంక్ మేనేజర్ వర్మ బంగారు ఆభరణాలు విడిపించాలంటే మొత్తం రూ.68,51,300 ఫెడరల్ బ్యాంక్ ఖాతాలో జమచేయాలని సూచించారు. దీంతో జగదీశ్వరరావు తన క్యాషియర్ సంతోష్‌తో మాట్లాడి ఆ మొత్తాన్ని యాక్సిస్ బ్యాంక్ ఖాతా ద్వారా చెల్లించాడు. శనివారం సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో రూపిక్ బ్యాంక్ సిబ్బంది పార్శిల్ కవర్‌తో వచ్చి దానిని వారికి ఇచ్చి వెంటనే వెళ్లిపోయారు. ఆ పార్శిల్ తెరిచి చూడగా అందులో నకిలీ బంగారం ఉన్నట్లు గ్రహించారు. వెంటనే జగదీశ్వరరావు తనను మోసం చేశారని, మంచి బంగారం ఉందని చెప్పి నకిలీది ఇచ్చారని గురుమూర్తి, త్రినాథ్, ఈశ్వరరావు, మోహనరావు, రాఘవేంద్ర, రాజులను నిలదీశాడు. నకిలీ బంగారమని తమకు తెలియదని వారు బదులిచ్చారు. దీంతో జగదీశ్వరరావు మోసపోయినట్లు గ్రహించి వారిని ద్వారకా పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లాడు. తనకు నకిలీ బంగారంతో మోసం చేశారని సైబర్ సెల్‌కి ఫోనులో ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. సీఐ రమణ కేసు నమోదు చేశారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



పూర్ణామార్కెట్‌లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంపీ శ్రీభరత్ తదితరులు



27వ వార్డులో మహిళలకు చీరలు అందజేస్తున్న దక్షిణ ఇన్‌ఛార్జి సుధాకర్

మహారాణిపేట/మర్రిపాలెం/కంచరపాలెం/అక్కయ్యపాలెం/సీతంపేట/సీతమ్మధార/మురళీనగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం దక్షిణ, ఉత్తర నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేకులు కోసి పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. పార్టీ పతాకాలను ఎగురవేశారు. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తామని ప్రతినబూనారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పార్టీకి వెన్నెముకలాంటి క్యాడర్ వ్యవస్థ నిర్మితమైందని అన్నారు. టీడీపీ ప్రభుత్వం నిరంతరం ప్రజా సంక్షేమానికి పాటుపడుతుందని నాయకులు ఉద్ఘాటించారు. దేశ, రాష్ట్ర రాజకీయాల్లో టీడీపీ నిర్వహిస్తున్న పాత్రను నేతలు వివరించారు. వన్‌టౌన్ పూర్ణామార్కెట్ వద్ద 36వ వార్డు ఇన్‌చార్జి కేదారి లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఎంపీ భరత్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ, సౌత్ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ విచ్చేసి ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అక్కయ్యపాలెం ఎనభై అడుగుల రోడ్డు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఉత్తర నియోజకవర్గం నాయకుడు వెల్లంకి భరత్ ఆవిష్కరించారు. మర్రిపాలెంలో విశాఖ పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమానికి ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను గుర్తుచేశారు. కంచరపాలెంలో పార్టీ సీనియర్ కార్యకర్తలు సకురుబాబూరావు, చెంగ వీరమ్మలను ఈతలపాక సుజాత, వార్డు కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. గురుద్వార కూడలిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎండి నజీర్, సారిపిల్లి గోవింద్ తదితరులు పాల్గొన్నారు. విశాఖ ఉత్తరంలోని మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లో పార్టీ సీనియరు నాయకులు బత్తుల. రమణ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. రైల్వే న్యూకాలనీలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద జరిగిన వేడుకల్లో పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అకిరెడ్డి జగదీష్, వార్డు అధ్యక్షుడు కన్నం వెంకట రమణారావు, ప్రధాన కార్యదర్శి ముక్కి రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు. పార్టీ తరపున ఎన్నికైన వార్డు కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, రాష్ట్ర, జిల్లా స్థాయుల్లో పార్టీ పదవులు పొందిన అనేక మంది ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు రాజకీయాల్లో టీడీపీ పోషించిన పాత్రను నేతలు వివరించారు.

భక్తిశ్రద్ధలతో నూకాంబిక అమ్మవారికి పూజలు



బర్మాక్యాంపులో నూకాంబిక అమ్మవారు

మాధవధార/కంచరపాలెం/అక్కయ్యపాలెం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కొత్త అమావాస్య సందర్భంగా శనివారం వివిధ ప్రాంతాల్లో నూకాంబికా అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. మండుటెండను సైతం లెక్కచేయకుండా క్యూలైన్లలో నిరీక్షించి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అమ్మవారి మూలవిరాట్టులను దివ్యంగా అలంకరించారు. బర్మాక్యాంపు రోడ్డులో రథం ఊరేగింపు, సాయంత్రం అగ్నిగుండాల జాతర కన్నుల పండువగా జరిగాయి. మార్చి 21 నుంచి ఆరంభమైన కొత్త అమావాస్య జాతర మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. సాలిగ్రామపురంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ బారికేడ్లు ఏర్పాటు చేసి వరుస క్రమంలో దర్శనాలకు పంపింది. శ్రీ వీరాంజనేయ ఆటో స్టాండ్ డ్రైవర్లు ఉదయం, సాయంత్రం మజ్జిగ, రస్నా, ప్రసాదం వితరణ చేశారు. కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో నూకాలమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కంచరపాలెం మెట్టు గాంధీనగర్ ఆలయం, గంగన్న నగర్, దేవేంద్ర నగర్, రవీంద్రనగర్, తుమ్మడిపాలెం, కప్పరాడ, రాంజీ ఎస్టేట్ తదితర ప్రాంతాల్లోని ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మాలధారణ భక్తులు శూలాలు ధరించి ఘటాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆలయాల వద్ద అగ్ని గుండం తొక్కారు. అమ్మవారి ప్రతిమలతో మహిళలు ర్యాలీ నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాత్రంతా అమ్మవారిని కొలిచారు.

రూ.200 కోట్లతో పారా స్పోర్ట్సు ట్రైనింగ్ సెంటర్

శాప్ చైర్మన్ రవినాయుడు వెల్లడి



వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, డిప్యూటీ కలెక్టర్ మాధవితో చర్చిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

విశాఖపట్నం స్పోర్ట్సు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని కొమ్మాది ప్రాంతంలో రూ.200 కోట్ల వ్యయంతో పారా స్పోర్ట్సు ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా విశాఖను క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. క్రీడల అభివృద్ధికి ప్రభుత్వ సంస్థలతోపాటు కార్పొరేట్, ప్రైవేటు సంస్థలను భాగస్వాములను చేసి సమష్టిగా ముందుకు వెళ్లే చర్యలు చేపడుతున్నామన్నారు. శనివారం వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.ప్రణవ్ గోపాల్‌తో కలిసి కొమ్మాదిలోని క్రీడా వికాస కేంద్రాన్ని సందర్శించారు. ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్సు కాంప్లెక్సులోని బ్యాడ్మింటన్, వాలీబాల్ హాల్స్, జిమ్, అవుట్‌డోర్ క్రీడల మైదానాన్ని పరిశీలించారు. క్రీడాకారులకు ఆహ్లాదకర వాతావరణం అందించాలని డీఎస్ఏ అధికారులను ఆదేశించారు. ఇక్కడ నుంచి అంతర్జాతీయ, జాతీయ క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు అవసరమైన ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనకు ఖేలో ఇండియా నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. హాకీ టర్ఫ్‌లు, ఫుట్‌బాల్ కోర్టులు, 400 మీటర్ల పరుగు మార్గాల నిర్మాణానికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు, కోచ్‌లు, సిబ్బంది సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. పారా స్పోర్ట్సు ట్రైనింగ్ సెంటర్‌కు కేటాయించిన స్థలాన్ని ఆయన పరిశీలించి అభివృద్ధి పనుల ప్రణాళికలపై డిప్యూటీ కలెక్టర్ మాధవితో సమీక్షించారు.

'బహుళ కాంతి ధర్మాలు' చిత్రానికి ప్రథమ బహుమతి

డాబాగార్డెన్స్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): 'బహుళ కాంతి ధర్మాలు' అనే సైన్సు ఫోటోకు జాతీయ పోటీల్లో ప్రథమ బహుమతి లభించడం సంతోషంగా ఉందని సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ జోగ చంద్రశేఖర్‌రావు అన్నారు. ఫౌండేషన్ ఫర్ అడ్వాన్సింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇండియా ఆధ్వర్యంలో జనవరి 11, 12 తేదీల్లో నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో భౌతిక శాస్త్రానికి సంబంధించిన 'ఒకే ఫ్రేమ్ ఫోటోలో బహుళ కాంతి ధర్మాలు' అనే ఫోటోను ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ ఫోటోను సాధారణ సెల్‌ఫోన్‌తో తీసినట్లు చెప్పారు. ఈ ఫోటోను స్కూల్ అసిస్టెంట్లు పండూరు వేణుగోపాల్, బొత్స వెంకటరావు, పి.శ్రీనివాస్ కలిసి పంపించగా జాతీయ పోటీలో ప్రథమ బహుమతి లభించిందన్నారు. ఈ సందర్భంగా భౌతిక శాస్త్ర ఉపాధ్యాయ, అధ్యాపకులు, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ ఐఏపీటీ ఆంధ్రప్రదేశ్, ఫోకస్ ఐఏపీటీ అన్వేషిక రాష్ట్ర సభ్యులు అభినందనలు తెలియజేశారన్నారు.



చిత్రాన్ని పరిశీలిస్తున్న సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జోగ చంద్రశేఖర్‌రావు తదితరులు

కనకమహాలక్ష్మి అమ్మవారికి సహస్ర తులసి అర్చన

మహారాణిపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారికి శనివారం సహస్ర తులసి అర్చన నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం నిర్వహించారు. ఎనిమిది మంది ఉభయదాతలు, భక్తులు పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదివారం ఉగాది పర్వదినం సందర్భంగా కనకమహాలక్ష్మి అమ్మవారు స్వర్ణకవచ అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు.



అమ్మవారి మూలవిరాట్టుకు తులసి దళాలతో పూజ

అంబికాబాగ్ ఆలయంలో నేడు పెళ్లి రాట

మహారాణిపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఏప్రిల్ 7న నిర్వహించే శ్రీరామనవమి ఉత్సవాలకు ఆదివారం పెళ్లి రాట వేస్తారు. అనంతరం శ్రీరామచంద్రమూర్తిని పెండ్లికొడుకుగా తయారు చేస్తారు. ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం చేయనున్నట్లు అధికారి తెలిపారు.

క్యాన్సర్ పరిశోధనలపై సమాలోచనలు



సమావేశంలో పాల్గొన్న వైద్య నిపుణులు

మహారాణిపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ నివారణకు చేపట్టే పరిశోధనలకు యువ వైద్య నిపుణులు నిబద్ధతతో ముందుకు రావాలని ప్రముఖ అంకాలజిస్టు హూమీ బాబా క్యాన్సర్ ఆసుపత్రి రీసెర్చి సెంటర్ వ్యవస్థాపకుడు డాక్టర్ డి రఘునందనరావు పిలుపునిచ్చారు. ఆంధ్ర వైద్య కళాశాల అంకాలజీ విభాగంలో డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు పేరిట 'క్యాన్సర్ పరిశోధనలో కెరీర్‌ను రూపొందించడం' అనే అంశంపై శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. క్యాన్సర్ నివారణకు ప్రాథమిక అనువాద క్లినికల్ పరిశోధనల ప్రాధాన్యతను వివరించారు. క్యాన్సర్ చికిత్సలో కొత్త పరిష్కారాల అభివృద్ధికి ప్రోత్సాహం అవసరమని అన్నారు. ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ లీలా మాట్లాడుతూ మహిళల ఆరోగ్య సమస్యలు, గర్భాశయ క్యాన్సర్‌ల సమగ్ర నివారణ విధానాన్ని వివరించారు. 35 నుంచి 65 ఏళ్ల వయసు మహిళలకు స్క్రీనింగ్ అవసరమని, యువతులకు విస్తృతంగా హెచ్‌పీవీ టీకా ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద తదితరులు పాల్గొన్నారు.

యూత్ పార్లమెంట్‌కు ముగ్గురు విద్యార్థినుల ఎంపిక

మహారాణిపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి యూత్ పార్లమెంట్‌కు విశాఖ నోడల్ ఏజెన్సీ నుంచి జ్యోత్స్న, లాస్య, శివానీ అనే ముగ్గురు విద్యార్థినులు ఎంపికయ్యారని నెహ్రూ యువ కేంద్రం అధికారి జి.ఉమామహేశ్వరరావు తెలిపారు. వచ్చే నెలలో జరిగే యూత్ పార్లమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు.

నూరుశాతం ఉద్యోగాల సాధన గొప్ప విషయం: ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు



ఉద్యోగాలు పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ తదితరులు

కంచరపాలెం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కెమికల్ కళాశాల విద్యార్థులందరూ కోర్సులు పూర్తికాగానే ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించడం గర్వకారణమని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు ప్రశంసించారు. కంచరపాలెం కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ ఆధ్వర్యంలో శనివారం ఉద్యోగ సాధకుల (జాబ్ అచీవర్స్ డే) వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు విద్యార్థులను ప్రోత్సహించేలా ప్రసంగించారు. అధికశాతం పేద, మధ్య తరగతి విద్యార్థులైనప్పటికీ అధ్యాపకుల ప్రోత్సాహంతో ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. ప్రొఫెసర్ వీఎస్ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగాలు సాధించిన యువత వారి కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ మొదటి నుంచి విద్యార్థులకు చక్కని భవిష్యత్‌ను అందించాలనే ధ్యేయంతో పనిచేస్తున్నారన్నారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన 171 మంది విద్యార్థుల తల్లిదండ్రులను అతిథులు సత్కరించారు. డా.ప్రశాంత కుమారి, డా.బీవీ లక్ష్మణరావు, సీహెచ్.జయప్రకాశ్‌రెడ్డి, డి.దామోదర్, పాల్గొన్నారు.

మానవ వికాసానికి సాహిత్యం దోహదం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కూటికుప్పల సూర్యారావు

సీతంపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సాహిత్యం మానవ వికాసానికి దోహదం చేస్తుందని పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో శనివారం విశ్వావసు ఉగాది కవి సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ కూటికుప్పల సూర్యారావు ఉగాది విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.వి.సూర్యారావు, డాక్టర్ ఎన్.ఉమాసుందరి, డాక్టర్ కేజీ వేణులు ఉగాది పుట్టు పూర్వోత్తరాలను వివరించారు. కవి సమ్మేళనం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సీహెచ్ చినసూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణమూర్తి, డాక్టర్ ఎం.విజయగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ జాగృతిలో రచయితల పాత్ర కీలకం

డాబాగార్డెన్స్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని జాగృతం చేయడంలో రచయితల పాత్ర కీలకమని ప్రతిభ సాంస్కృతిక, క్రీడా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.కృష్ణమూర్తి అన్నారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం 'ఆణిముత్యం' ఉగాది జీవిత సాఫల్య పురస్కారం, కవిబ్రహ్మ రచయిత సత్తివాడ శ్రీకాంత్‌కు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవిగా, గేయ రచయితగా, లఘు చిత్ర దర్శకుడుగా సమాజాన్ని చైతన్య పరుస్తున్న శ్రీకాంత్ మరిన్ని సేవలందించాలన్నారు. వి.భాస్కరరావు, ఎస్.మాస్టర్, రాజు, డా.శ్రీధర్, కె.విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

రూ.11.85 కోట్ల ఆస్తిపన్ను వసూలు

జ్ఞానాపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-5 పరిధిలోని పోర్టు ట్రస్ట్ నుంచి శనివారం రూ.11.85 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేశారు. దీనికి సంబంధించిన చెక్కును డీసీఆర్ సోమన్నారాయణకు జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము, రెవెన్యూ అధికారి బాబూరావులు అందజేశారు. ఆది, సోమవారాలు సెలవు దినాలైనా సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్వో రాజ్యలక్ష్మి, ఆర్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దుశ్చర్య

... 7వ పేజీ తరువాయి

వాహనాల వద్ద హఠాత్తుగా మంటలు చెలరేగాయి. పెట్రోల్‌తో ఉన్న వాహనాలు కావడం, మంటలు పెద్దఎత్తున వ్యాపించడంతో అదే అపార్టుమెంట్ సెల్లార్‌లో ఆరుగురు సభ్యులతో నివసిస్తున్న కుటుంబం హాహాకారాలు చేసింది. మంటలు వారి ఇంటి లోపలకు కూడా వ్యాపించాయి. కుటుంబ సభ్యులు వెనుక వైపు నుంచి బయటకు వచ్చి ప్రాణాలు దక్కించుకున్నారు. ఇంట్లోని వస్తువులు మాడి మసయ్యాయి. సమాచారం అందుకుని అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సుమారు ఇరవై రోజుల క్రితం ఇదే అపార్టుమెంట్‌కు చెందిన ఒక యువకుడి వాహనాన్ని కొందరు తగులబెట్టారు. అతను నూతన వాహనం కొనుగోలు చేసి ఉగాది రోజు పూజ చేయించాలని అపార్టుమెంట్ పార్కింగ్‌లో పెట్టాడు. ఈ నేపథ్యంలో మళ్లీ ఆ యువకుడి వాహనాన్ని దహనం చేసేందుకు గుర్తుతెలియని వ్యక్తులు ప్రయత్నించి ఉంటారని, ఈ క్రమంలో వాహనాలన్నీ కాలిపోయి ఉంటాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు క్లూస్ టీమ్‌తో ఘటనా స్థలానికి వచ్చి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

నలుగురికి కళారత్న అవార్డులు

... 7వ పేజీ తరువాయి

సరస్వతి విద్యార్థి (కర్ణాటక వయలిస్ట్-సంగీతం),పాలగుమ్మి రాజగోపాల్ (సంగీతం) ఉన్నారు.

ఉగాది పురస్కారం పొందిన వారిలో కుప్పిలి పద్మ (సాహిత్యం), శిరేల సన్యాసిరావు (సాహిత్యం), డాక్టర్ బండి సత్యనారాయణ (సాహిత్యం), గుంటుకు వెంకటరావు (సంగీతం), డాక్టర్ ఆముక్త మాల్యాద (నృత్యం), డి.హేమ వేంకటేశ్వరి (నాటకం), కొల్లాబత్తుల విజయకుమార్ (మిమిక్రీ), బీఆర్ విక్రమ కుమార్ (జర్నలిజం), కనపర్తి రాణి (జర్నలిజం), ఎం.విజయకుమార్ (పెయింటింగ్) ఉన్నారు.

పత్రికా పఠనంతో ప్రపంచ జ్ఞానం

... 7వ పేజీ తరువాయి

డ్రా ద్వారా ద్వితీయ బహుమతి విజేతను ఎంపిక చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్షరమే ఆయుధమంటూ వినూత్నమైన ఒరవడితో 'ఆంధ్రజ్యోతి' ముందుకు సాగుతోందన్నారు. సంక్రాంతి సమయంలో ముగ్గుల పోటీలు కూడా నిర్వహిస్తోందని, ఈ విధంగా పాఠకులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. లక్కీ డ్రాలో మూడో విజేతను ఎంపిక చేసిన ఐకానిక్ ప్రాజెక్ట్స్ మార్కెటింగ్ హెడ్ అవినాష్‌వర్మ మాట్లాడుతూ ప్రింట్ మీడియాలో ప్రముఖ సంస్థగా కొనసాగుతోన్న 'ఆంధ్రజ్యోతి' పాఠకులకు ప్రోత్సాహకాలను అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సర్క్యులేషన్ డైరెక్టర్ టి.రామకృష్ణారావు, బ్రాంచ్ మేనేజర్ కె.రామకృష్ణారావు, సిస్టమ్స్ మేనేజర్ ఎం.కిశోర్‌బాబు, ఎడిషన్ ఇన్‌చార్జి ఎల్.వి.రామాంజనేయులు, బ్యూరో ఇన్‌చార్జి యర్రా శ్రీనివాసరావు, సర్క్యులేషన్ ఇన్‌చార్జి బీఏవీ సత్యనారాయణ, అడ్వర్‌టైజ్‌మెంట్ ఇన్‌చార్జి శ్రీనివాసచక్రవర్తి, ప్రొడక్షన్ ఇన్‌చార్జి కుమార్, సీనియర్ స్టాఫ్ రిపోర్టర్లు నాళ్ల ఆదినారాయణ, రెడ్డి వెంకటరావు, పలు విభాగాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

ఐపీఎల్ సందడి

... 7వ పేజీ తరువాయి

సెంచరీతో చెలరేగిన ఇషాన్ కిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. ఇటీవల ఆస్ట్రేలియాలో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో ఆసీస్‌పై అద్భుత సెంచరీ సాధించిన నితీష్‌కుమార్...తొలిసారి సొంత గ్రౌండ్‌లో ఐపీఎల్ మ్యాచ్ ఆడనున్నాడు. ఈ నేపథ్యంలో క్రీడాభిమానులు అతనిపై అంచనాలు పెట్టుకున్నారు. ఇక ఢిల్లీ క్యాపిటల్స్ విషయానికి వస్తే తొలి మ్యాచ్‌లో వీరవిహారం చేసి జట్టుకు అద్భుతమైన విజయాన్ని అందించిన మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ అశుతోష్‌శర్మకు తోడు స్టబ్స్, డుప్లెసిస్, అభిషేక్ పోరల్ వంటివారు రాణిస్తే భారీ స్కోరు సాధించే అవకాశాలున్నాయి. ఈ మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ ఆడనున్నారు. మ్యాచ్ మధ్యాహ్నం 3.30 నుంచి ప్రారంభం కానుంది.

పిచ్‌పై అంచనాలు

ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలోని పిచ్ (వికెట్)పై 200కు పైగా స్కోరు వచ్చే అవకాశాలున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. అలాగే టాస్ కూడా కీలకం అవుతుందని భావిస్తున్నారు. ఈనెల 24 జరిగిన తొలి మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై తొలుత బ్యాటింగ్ చేసిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ 209 పరుగుల స్కోరు చేసింది. ఆదివారం జరిగే మ్యాచ్‌లో తొలి బ్యాటింగ్ చేసే జట్టు ప్రత్యర్థులకు 250 పరుగుల వరకు లక్ష్యాన్ని నిర్దేశించే అవకాశాలున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ముమ్మర సాధన

కీలక మ్యాచ్‌లో తలపడేందుకు ఇరుజట్ల ఆటగాళ్లు శనివారం ముమ్మర సాధన చేశారు. ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లు ఐదు రోజులుగా సాధన కొనసాగించగా, శుక్రవారం సాయంత్రం నగరానికి చేరుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాళ్లు శనివారం ఒక్కరోజు సాధన చేసే అవకాశం లభించింది.

ప్రభావం చూపని టిక్కెట్ల ధర : దాదాపు 25 వేలకుపైగా సీటింగ్ సామర్థ్యం కలిగిన స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్, లఖనవూ జట్ల మధ్య ఈ నెల 24న జరిగిన తొలి మ్యాచ్‌కు 70 శాతం వరకూ సీట్లు నిండాయి. అయితే ఆదివారం జరిగే మ్యాచ్‌కు క్రీడాభిమానులు ఆసక్తి కనబరచడంతో శనివారం సాయంత్రానికి రూ.ఆరు వేల టికెట్లు మినహా మిగిలినవన్నీ పూర్తిగా అమ్ముడైపోయాయి.

ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు (అంచనా) : అక్షర పటేల్ (కెప్టెన్), మెక్‌గుర్క్, డుప్లెసిస్, అభిషేక్ పోరెల్, సమీర్ రిజ్వీ, ట్రిస్టన్ స్టబ్స్ అశుతోష్ శర్మ, విప్‌రాజ్ నిగమ్, మిచెల్ స్టార్క్, కులదీప్ యాదవ్, మోహిత్ శర్మ, ముకేష్‌కుమార్, కెఎల్ రాహుల్.

సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు (అంచనా) :కమిన్స్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, నితీష్‌కుమార్‌రెడ్డి, ఇషాన్ కిషన్, హెన్రిచ్, అనికేత్ వర్మ, అభినవ్ మనోహర్, జంపా, సిమ్రన్‌జీత్, హర్షల్ పటేల్, మహ్మద్ షమి

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

మద్దిలపాలెం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 23వ వార్డులో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, సత్యారెడ్డి పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అలర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రి అయ్యాకే పేదలకు రూ.2లకు కిలో బియ్యం, పింఛన్, జనతా వస్త్రాలు, పక్కా ఇల్లు వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. ఆయన తర్వాత చంద్రబాబు సారథ్యంలో పార్టీ మరింత పటిష్టపడడమే కాకుండా పేదలకు మేలు జరిగే కార్యక్రమాలు ప్రవేశపెడుతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పురుషోత్తం, అప్పలరెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మద్దిలపాలెం : ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కార్పొరేటర్ గుడ్ల విజయసాయి



ఎంవీపీ కాలనీ : 15వ వార్డులో టీడీపీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పార్టీ శ్రేణులు



ఆరిలోవ : పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ రామలక్ష్మీరాజశేఖర్



పెదవాల్తేర్ : చలివేంద్రం ప్రారంభిస్తున్న పట్టాభిరామ్, పోతన్న రెడ్డి తదితరులు

- ఎన్టీఆర్‌కు టీడీపీ నేతలు, కార్యకర్తల నివాళి
- పార్టీ పతాకం ఆవిష్కరణలు
- పలు చోట్ల సేవా కార్యక్రమాలు

22వ వార్డులో..

స్థానిక 22వ వార్డులో టీడీపీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాప్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఒమ్మి అప్పారావు, దువ్వి స్వామి, నాగూర్‌బాబు, కోడిబోయిన ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పదిహేడో వార్డులో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం ఆధ్వర్యంలో పలువురు నేతలు, కార్యకర్తలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ జెండా ఎగురవేశారు. కార్పొరేటరు గేదెల నాగరాజు, టీడీపీ జిల్లా కార్యదర్శి నెక్కంటి సత్తిబాబు, నాయకులు కాళ్ల శంకర్, రాములమ్మ, గోపమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ : జీవీఎంసీ 10వ వార్డులోని రవీంద్రనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీరాజశేఖర్ .. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నటుడుగా, ప్రజాప్రతినిధిగా ఎన్టీఆర్ తెలుగు రాష్ట్రాలకు అందించిన సేవలను కొనియాడారు. ఎన్టీఆర్ సంక్షేమ పాలనకు ఆద్యుడిగా పేర్కొన్నారు. అలాగే క్షేత్ర ఇన్‌చార్జి రాజేష్ తదితరులు ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించారు. రవీంద్రనగర్, ఆదర్శనగర్, సుందర నగర్, బీఎన్ఆర్ నగర్, ఇందిరా నగర్‌తదితర ప్రాంతాల్లో ఉన్న నందమూరి తారక రామారావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాలు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ 10వ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయడు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

పెదవాల్తేరులో..

పెదవాల్తేరు : జీవీఎంసీ 20వ వార్డు పరిధి పెదవాల్తేరు గాంధీబొమ్మ సెంటర్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్, వార్డు అధ్యక్షుడు బైరెడ్డి పోతన్నరెడ్డి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పి.వాసు, మద్ది శ్రీను, కాళ్ల శంకర్, చిన్నిపిల్లి రామిరెడ్డి, మరడ సితన్నరెడ్డి, సిహెచ్ జ్యోతి, మూర్తి గోవింద రెడ్డి, పి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే 21వ వార్డులో టీడీపీ వార్డు అధ్యక్షుడు పీతల అమరేంద్ర అధ్వర్యంలో చినవాల్తేరులోని హోమన హోటల్ సెంటర్‌లో గల ఏన్టీఆర్ విగ్రహానికి పలువురు టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తూర్పు నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు పీతల అవినాష్, వార్డు నాయకులు ప్రసాద్, చిన్న, మురళి, మూర్తి, ధర్మ, సురేష్, కనకరాజు, రమేష్, బొట్ట సాయి, వినోద్ మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ 17వ వార్డు చిన్నిపిల్లి వీధిలో చలివేంద్రాన్ని టీడిపి రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్, టీడీపీ సీనియర్ నాయకులు పోతన్న రెడ్డి, గేదెల నాగరాజు, కాళ్ల శంకర్, నరేంద్ర, రామిరెడ్డి తారక రెడ్డి తదితరులు చలివేంద్రాన్ని ప్రారంభించారు.

వెంకోజీపాలెంలో...

వెంకోజీపాలెం : జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురం కాలనీ, కొత్త వెంకోజీపాలెం, పాత వెంకోజీపాలెం, హెచ్‌బీ కాలనీ తదితర ప్రాంతాల్లో టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే 16వ వార్డు ఇసుకతోట ప్రాంతంలోని ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీడీపీ 15వ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, బోర ధనరెడ్డి, అప్పారి వెంకట గిరిబాబు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు సంపంగి గోవింద్, ఆడారి సూరిబాబు, అప్పలరాజు, కర్రి శ్రీను, వరలక్ష్మి, సోని తదితరులు పాల్గొన్నారు.

అలాగే 16వ వార్డులో నిర్వహించిన వేడుకల్లో టీడీపీ వార్డు అధ్యక్షుడు నారు గోపి, తూర్పు నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు పల్లా ఉమారాణి, మొల్లి శంకర్, మొల్లి శోభ, జి.అప్పన్న, ఎన్.కొండలరావు, ఆర్.భరత్‌కుమార్, కె.శ్రీను, ఎం.సత్యనారాయణ, ఎం.రవి, పైడిరాజు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **రాబిన్‌హుడ్ :** జగదాంబ, శ్రీ లీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **మ్యాడ్2:** జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఛావా :** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు(నలుపు) 28, బెండకాయలు 34, పచ్చిమిర్చి30, కాకరకాయలు 36, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 18, బంగాళ దుంపలు 15, అరటికాయ(పె)8, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది)50, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 54, దోస కాయలు 28, వె ల్లుల్లి (పెద్దవి) 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 48, కీరదోస 22, కాప్సికమ్ 36, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 60, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట)3, తోటకూర (కట్ట)3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	455
విజయనగరం	459
శ్రీకాకుళం	459

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	104
లైవ్ ధర	124
విత్ స్కిన్	218
స్కిన్‌లెస్	228

తండ్రిపై బ్లేడుతో దాడి చేసి చంపిన తనయుడు

ఆరిలోవ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : కుమారుడు బ్లేడుతో గాయపరచడంతో తండ్రి మృతి చెందిన ఘటన ఆరిలోవ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించి ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

ఆరిలోవ రెండో సెక్టార్‌లో గల డ్రైవర్స్ కాలనీలో నివాసం ఉంటున్న పి.అప్పారావు తన చాదస్తంతో భార్యను కుమారుడిని నిత్యం వేధిస్తూ మానసిక వేదనకు గురి చేసేవాడు. ఈ క్రమంలో శనివారం భార్యను తీవ్రంగా కొట్టాడు. కుమారుడు బాలయోగి పనికి ఎందుకు వెళ్లలేదంటూ దూషించాడు. ఈ నేపథ్యంలో కోపోద్రిక్తుడైన కుమారుడు బాలయోగి బ్లేడును తండ్రికి చూపించి దాంతో కోసివేస్తానంటూ బెదిరించాడు. దీంతో అప్పారావు కుమారుడిపై మరింతగా రెచ్చిపోగా, బాలయోగి తండ్రిపై బ్లేడుతో దాడి చేసి గాయపరిచారు. పెనుగులాటలో బ్లేడు గుండెపై తగలడంతో అప్పారావు తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే విమ్స్‌కు తరలించగా, వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్టు చెప్పారు. పంచనామా నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. తండ్రిపై దాడి చేసి ప్రాణాలు పోవడానికి కారణమైన కుమారుడు బాలయోగిని ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.



మృతుడు అప్పారావు (ఫైల్‌ఫోటో)

గ్రేటర్ బడ్జెట్ రూ.4,601.4 కోట్లు

... 7వ పేజీ తరువాయి

ముగియాల్సిన బడ్జెట్ సమావేశాన్ని ఇంతవరకూ నిర్వహించకపోవడానికి కారణం చెప్పాలని డిమాండ్ చేశారు. దీనికి అదనపు కమిషనర్ (ఫైనాన్స్) ఎస్.ఎస్.వర్మ సమాధానం ఇస్తూ జనవరి మొదటి వారంలో నిర్వహించాలకున్నప్పటికీ...పీఎంనరేంద్రమోదీ పర్యటన, కమిషనర్ బదిలీ, ఎమ్మెల్సీ ఎన్నిక కోడ్ వంటి కారణాలతో సాధ్యపడలేదని వివరించారు. దీనికి జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ స్పందిస్తూ బడ్జెట్ సమావేశం నిర్వహించడంలో విఫలమైనందుకు నైతిక బాధ్యత వహిస్తూ మేయర్ గొలగాని హరివెంకటకుమారి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అందుకు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సమాధానం ఇస్తూ రాష్ట్రంలోనే అతిపెద్ద కార్పొరేషన్‌గా గుర్తింపుపొందిన జీవీఎంసీకి రెండు నెలలుగా కమిషనర్‌ను నియమించలేకపోయారని, దీనికి బాధ్యత వహిస్తూ టీడీపీ కార్పొరేటర్లు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై సభలో టీడీపీ సభ్యులు తీవ్రస్థాయిలో అభ్యంతరం తెలపడంతో గందరగోళం ఏర్ప డింది. అదే సమయంలో ఇన్‌చార్జి కమిషనర్ హోదాలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ కౌన్సిల్‌హాల్‌లోకి రావడంతో సభ్యులంతా ఎవరి స్థానాల్లో వారు కూర్చున్నారు. అనంతరం మేయర్ హరివెంకటకుమారి బడ్జెట్ ముసాయిదాలోని అంశాలు, జీవీఎంసీకి వివిధ మార్గా ల ద్వారా వచ్చే ఆదాయం అంచనాలతోపాటు వివిధ విభాగాల ద్వారా చేసే ఖర్చులకు సంబంధించిన వివరా లను చదివి వినిపించారు. ఈ దశలో సీపీఐ కార్పొరేటర్ ఏజే స్టాలిన్ మాట్లాడుతూ బడ్జెట్ కేటాయింపుల్లో విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేశారని అసంతృప్తి వ్యక్తంచేశారు. సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు మాట్లాడుతూ బడ్జెట్‌ను పూర్తిగా అంకెలతో నింపేశారని, వాస్తవ ఆదాయం, ఖర్చులను పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. గత ఏడాది బడ్జెట్ కంటే గరిష్ఠంగా 20 శాతం మించి బడ్జెట్ అంచనాలు ఉండకూడదనే విషయాన్ని స్టాండింగ్ కమిటీ విస్మరించడం సరికాదన్నారు. ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ సమాధానం ఇస్తూ బడ్జెట్‌ను అంచనాల ఆధారంగానే రూపొందిస్తామని, ముందుగా తయారుచేసిన ముసాయిదాలో మరింత ఎక్కువ మొత్తం చూపించడంతో రూ.865 కోట్లు తగ్గించి ప్రస్తుత బడ్జెట్‌ను రూపొందించామని వివరించారు. 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత బడ్జెట్‌లో క్రీడలకు కేవలం రూ.15 కోట్లు మాత్రమే కేటాయించారని, ఆ మొత్తంతో నగర పరిధిలో క్రీడలను అభివృద్ధి చేయడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస్ మాట్లాడుతూ బడ్జెట్ గురించి మేయర్‌కు సరైన బాధ్యత లేకుండా పోయిందన్నారు. ముడసర్లోవలోని గుర్రాలపార్కు అంటే ఏదో బొమ్మలు పెడతారనుకుని కాంట్రాక్టర్‌కు రూ.3.5 కోట్లు చెల్లించేందుకు సంతకం చేసేశానని అంటారని ఎద్దేవా చేశారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జీవీఎంసీ ఆదాయాన్ని జీవీఎంసీయే ఖర్చు పెట్టుకునేందుకు వీలుగా సీఎఫ్ఎంఎస్‌ను పూర్తిగా రద్దు చేశారన్నారు. జీవీఎంసీ అభివృద్ధికి తోడ్పలేలా నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబుని అభినందిస్తూ కౌన్సిల్ తీర్మానం చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో సీఎఫ్ఎంఎస్‌లో రూ.170 కోట్లు, రిజిస్ట్రేషన్లపై సర్‌చార్జీల కింద రూ.110 కోట్లు ఇతర ప్రాజెక్టుల కింద రావాల్సిన బకాయిలు కలిపి రూ.570 కోట్లు ఉండిపోతే...వాటి విషయంలో కూటమి ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ తన కోటాలో త్వరలోనే రూ.పది కోట్లు నిధులు వస్తాయని, వాటిని నగర పరిధిలోనే ఖర్చు చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాల నిర్వహణలో జిల్లా కలెక్టర్ చట్టాన్ని పాటించడం లేదని, తనకు కనీసం నోటీసు కూడా ఇవ్వకుండానే సమావేశం పెట్టడం సరికాదన్నారు. తనకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సమాధానం ఇస్తూ చట్టబద్ధమైన కమిటీల సమావేశం పార్లమెంటు సమావేశాలతో నిమిత్తం లేకుండా నిర్వహించుకోవచ్చున్నారు. తమ అధికారులు సమావేశానికి ఆహ్వానం పంపించినా, స్పందించలేదని వివరించారు. ప్రతి రోజూ ఉదయం తొమ్మిదిన్నర నుంచి రాత్రి తొమ్మిదిన్నర వరకు తాను కార్యాలయంలోనే ఉంటున్నానని, అపాయింట్‌మెంట్ లేకుండానే కలిసే వెసులుబాటు ఉంది కాబట్టి, ఎప్పుడైనా, ఎవరైనా వచ్చి కలవచ్చునన్నారు.

కళలకు కేంద్రంగా విశాఖను తీర్చిదిద్దాలి

- ఏపీ శాసనసభ ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు
- ముగిసిన జాతీయ నాటకోత్సవాలు
- 'వేటగాడు' సినిమా డైలాగ్స్‌తో ఉత్సాహం నింపిన ఉప సభాపతి



మాట్లాడుతున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, వేదికపై రఘురామకృష్ణంరాజు, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, రైటర్స్ అకాడెమీ చైర్మన్ రమణమూర్తి

మద్దిలపాలెం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : కళలకు కేంద్రంగా విశాఖ నగరాన్ని తీర్చిదిద్దాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉప సభాపతి కనుమూరి రఘురామకృష్ణంరాజు పేర్కొన్నారు. పిఠాపురంకాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో రైటర్స్ అకాడమీ నిర్వహిస్తున్న లీడర్ విశాఖ జాతీయ నాటకోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ మహాకవి గురుజాడ రాసిన 'కన్యాశుల్కం' నాటకం సమాజాన్ని ఎంతో జాగృతం చేసిందన్నారు. గురజాడతో పాటు మహాకవి శ్రీశ్రీ, రావిశాస్త్రి, ఘంటసాల ఉద్దండులు పుటినిల్లు ఉత్తరాంధ్ర అని పేర్కొన్నారు. కళలు, నాటకాలను ప్రోత్సహించడానికి రైటర్స్ అకాడమీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా.. రఘురామకృష్ణంరాజు 'వేటగాడు' చిత్రంలోని ఎన్టీఆర్ డైలాగులు చెప్పి ప్రేక్షకుల్లో ఉత్సాహం నింపారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ నాటక రంగం నుంచే గురజాడ, కందుకూరి వంటి వారు వచ్చి సంఘ సంస్కరణలు చేశారన్నారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆడిటోరియం ఏర్పాటు చేయాలని తరచూ రమణమూర్తి కోరుతున్నారని, స్పోర్ట్స్, కల్చరల్ నిర్వహించేలా 5 ఎకరాల్లో ఆడిటోరియం నిర్మాణం చేయడానికి శాయుశక్తులా కృషి చేస్తానన్నారు. సినీ నటులు ఆర్.నారాయణ మూర్తి మాట్లాడుతూ నాటక రంగం నుంచే మహానుభావులు వచ్చారని గుర్తు చేశారు. మహాభారతం, రామాయణం వంటి పురాణాలు కొందరికి పరిమితయ్యాయని, నాటక రంగం అందిరికీ చేరువైందన్నారు. అనంతరం హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, ఆర్.నారాయణమూర్తిలకు ఘనంగా సన్మానం చేసి జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా కేరళ కళాకారులు ప్రదర్శించిన 'ద టైగర్ మ్యాన్' నాటిక ఆకట్టుకుంది. నక్సలైట్లు, పోలీసులు, అటవీశాఖ అధికారుల మధ్య జరిగే మారణకాండ గిరిజనుల జీవనంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో కళ్లకట్టినట్టు చూపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణ మూర్తి, కళాభిమానులు పాల్గొన్నారు.



హోం మంత్రి అనితను సన్మానిస్తున్న వీవీ రమణమూర్తి

టీడీపీ నగర కార్యాలయంలో..



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గంటా శ్రీనివాసరావు, తదితర నేతలు

విశాఖపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అధ్యక్షతన తొలుత పార్టీ జెండాను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ ఎగురవేసి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగువారి గుండె చప్పుడు తెలుగుదేశం పార్టీగా అభివర్ణించారు. తెలుగువారి ఆత్మగౌరవం కోసం ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. సభ్యత్వ నమోదులో కోటి మార్కు దాటి టీడీపీ కొత్తరికార్డును సృష్టించిందన్నారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ ప్రజల కోసం, వారి అభ్యున్నతి కోసం అంకితభావంతో పనిచేస్తూ దేశ రాజకీయ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని టీడీపీ సాధించిందన్నారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ టీడీపీ వచ్చా కే బడుగు, బలహీన వర్గాలకు గుర్తింపు వచ్చిందన్నారు. గండి బాబ్జీ మాట్లాడుతూ దివంగత ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ దేశంలోనే చరిత్ర సృష్టించిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పార్టీ నేతలు పొలమరశెట్టి శ్రీనివాసరావు, వెల్లంకి భరత్, లొడగల కృష్ణ, ముత్యాలనాయుడు, పప్పు రాజారావు, ఈతలపాక సుజాత, తోటరత్నం, ఎ.మధుసూదన రావు, టి.విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పార్టీలో సీనియర్లు ఎం.వాసుదేవరావు, ఎస్.సుజాత.బి.వెంకటరమణ, ఎస్.రామారావు, ఎం.దేవుళ్లు, పి.నాగేశ్వరరావు, కె.వెంకటరావు,ఇ.వాసుదేవరావు, టి.చినదేముడు,వి.మోహనరావు, సీహెచ్ అప్పారావు, జె.కన్నబాబు, ఆర్.నారాయణ, ఎం.నిర్మలకుమారి, ఎస్.ఉమామహేశ్వరరావులనుసత్కరించారు.

విద్యార్థులకు మనోధైర్యం అవసరం

భారత్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ పునీత్ యాద్ దాల్మియా

బీచ్ రోడ్డు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మనో ధైర్యం కలిగి ఉండాలని, అప్పుడే లక్ష్యాన్ని సాధించగలరని భారత్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ పునీత్ యాద్ దాల్మియా పేర్కొన్నారు. శనివారం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం ఆధ్వర్యంలో తొమ్మిదో వార్షిక స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పక్కా ప్రణాళిక, కఠోర సాధన చేస్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. విద్యారంగంలో దేశాన్ని ముందుకు నడిపించే సత్తా నేటి యువత చేతుల్లో ఉందన్నారు. దేశ ప్రగతి కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలన్నారు. ఐఐఎంలు, ఐఐటీలు, ఇతర ప్రముఖ విద్యా సంస్థల నుంచి వచ్చిన వారు నాణ్యమైన విద్య, పరిశోధనలతో పరిశ్రమకు సంబంధించిన పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. పరిశ్రమల నుంచి వచ్చే నిపుణులు, అభ్యాసకులు ద్వారా విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడే అవకాశాలున్నాయన్నారు. అనంతరం ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, బంగారు పతకాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ విశాఖపట్నం ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్, హరి ఎస్.భర్తియా, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు

వెంకోజీపాలెం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : అమావాస్యను పురస్కరించుకుని కొత్త వెంకోజీపాలెంలోని గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో వేంచేసి ఉన్న కాలభైరవ స్వామి కి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి మకర తోరణంను అలంకరించారు. ఆలయ అర్చకులు ప్రకాష్ శర్మ, సుబ్రహ్మణ్య శాస్త్రి, భాస్కర్‌శర్మల ఆధ్వర్యంలో భక్తుల పేరిట అభిషేకాలు, అర్చనలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఉదయం నుంచి సందడి నెలకొంది. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయ. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు డాక్టర్ బోర వెంకట రమణారెడ్డి, ఎస్.సత్యారావు, బోర ఎర్రాజిరెడ్డి, కాళ్ల వరహాలు, ఎస్.నరసింహారెడ్డి, భక్తులు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

నకిలీ బంగారు, వెండి ఆభరణాలతో మోసం

సీతంపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బంగారు దుకాణాల్లో నకిలీ బంగారం, వెండి ఆభరణాలను అమ్ముతూ వారి వద్ద నుంచి అసలు బంగారు, వెండి ఆభరణాలు తీసుకొని మోసం చేస్తున్న నలుగురు పంజాబీ మహిళలను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు. ద్వారకా పోలీసు స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో క్రైమ్ సీఐ వి.చక్రధరరావు, ఎస్ఐ ఎస్.రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... పంజాబ్‌లోని లూథియానా కిల్లామోహల్లా ఎదురుగా రామ మందిరం ప్రాంతానికి చెందిన రాజ్‌పుత్ మంజు (55), కాజల్ రాజ్‌పుత్ (19), మాలా రాజ్‌పుత్ (25), సునీత రాజ్‌పుత్ (22) అనే మహిళలు మార్చి నెలలో నగరానికి వచ్చారు. పంజాబ్‌లో తయారు చేసిన నకిలీ వెండి, బంగారు ఆభరణాలను వారితో తెచ్చుకున్నారు. మార్చి 26న సీతంపేట మధురానగర్‌లోని ఓ నగల దుకాణానికి ఇద్దరు, మరో ఇద్దరు ద్వారకానగర్‌లోని వైభవ్ జ్యూవలరీ దుకాణానికి వెళ్లారు. మధురానగర్‌లో 61 తులాల నకిలీ వెండి ఆభరణాలు ఇచ్చి కొత్త వెండి చెంబును తీసుకున్నారు. వైభవ్ జ్యూవలరీకి వెళ్లిన వారు సుమారు నాలుగు కేజీల నకిలీ వెండి వస్తువులు తీసుకెళ్లారు. అక్కడ పని చేస్తున్న ఎస్.వెంకటరమణకు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ద్వారకా నగర్ ప్రాంతంలో ఇద్దరిని, రైల్వే స్టేషన్ ప్రాంతంలో మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. బంగారు దుకాణాల్లో మోసం చేసి డైమండ్ ఫింగర్ రింగ్, వెండి చెంబు, మూడు బంగారు గొలుసులను, పంజాబ్ ప్రాంతం నుంచి తీసుకువచ్చిన సుమారు 5 కేజీల నకిలీ వెండి వస్తువులను స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆప్కాస్‌ను రద్దు చేసి కార్మికులను పర్మినెంట్ చేయాలి

కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు

గాజువాక, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్‌ను రద్దు చేసి మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని జీవీఎంసీ కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు కోరారు. గాజువాకలో శనివారం జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, గత సమావేశ ఒప్పంద నిర్ణయాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ రెండో తేదీన జీవీఎంసీ ఎదురుగా ఉన్న మహాత్మాగాంధీ పార్కు వద్ద చేపట్టనున్న ర్యాలీలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు అప్పారావు, రాము, సూరిబాబు, సూర్యనారాయణ, మీనాక్షి, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

పత్రికా పఠనంతో ప్రపంచ జ్ఞానం

... 7వ పేజీ తరువాయి

డ్రా ద్వారా ద్వితీయ బహుమతి విజేతను ఎంపిక చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్షరమే ఆయుధమంటూ వినూత్నమైన ఒరవడితో 'ఆంధ్రజ్యోతి' ముందుకు సాగుతోందన్నారు. సంక్రాంతి సమయంలో ముగ్గులు పోటీలు కూడా నిర్వహిస్తోందని, ఈ విధంగా పాఠకులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. లక్కీ డ్రాలో మూడో విజేతను ఎంపిక చేసిన ఐకానిక్ ప్రాజెక్ట్స్ మార్కెటింగ్ హెడ్ అవినాష్‌వర్మ మాట్లాడుతూ ప్రింట్ మీడియాలో ప్రముఖ సంస్థగా కొనసాగుతోన్న 'ఆంధ్రజ్యోతి' పాఠకులకు ప్రోత్సాహకాలను అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సర్క్యులేషన్ డైరెక్టర్ టి.రామకృష్ణారావు, బ్రాంచ్ మేనేజర్ కె.రామకృష్ణారావు, సిస్టమ్స్ మేనేజర్ ఎం.కిశోర్‌బాబు, ఎడిషన్ ఇన్‌చార్జి ఎల్.వి.రామాంజనేయులు, బ్యూరో ఇన్‌చార్జి యర్రా శ్రీనివాసరావు, సర్క్యులేషన్ ఇన్‌చార్జి బీవీవీ సత్యనారాయణ, అడ్వర్‌టైజ్‌మెంట్ ఇన్‌చార్జి శ్రీనివాసచక్రవర్తి, ప్రొడక్షన్ ఇన్‌చార్జి కుమార్, సీనియర్ స్టాఫ్ రిపోర్టర్లు నాళ్ల ఆదినారాయణ, రెడ్డి వెంకటరావు, పలు విభాగాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

ఐపీఎల్ సందడి

... 7వ పేజీ తరువాయి

సెంచరీతో చెలరేగిన ఇషాన్ కిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. ఇటీవల ఆస్ట్రేలియాలో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో ఆసీస్‌పై అద్భుత సెంచరీ సాధించిన నితీష్ కుమార్...తొలిసారి సొంత గ్రౌండ్‌లో ఐపీఎల్ మ్యాచ్ ఆడనున్నాడు. ఈ నేపథ్యంలో క్రీడాభిమానులు అతనిపై అంచనాలు పెట్టుకున్నారు. ఇక ఢిల్లీ క్యాపిటల్స్ విషయానికి వస్తే తొలి మ్యాచ్‌లో వీరవిహారం చేసి జట్టుకు అద్భుతమైన విజయాన్ని అందించిన మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ అశుతోష్‌శర్మకు తోడు స్టబ్స్, డుప్లెసిస్, అభిషేక్ పోరల్ వంటివారు రాణిస్తే భారీ స్కోరు సాధించే అవకాశాలున్నాయి.

పిచ్‌పై అంచనాలు

ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలోని పిచ్ (వికెట్)పై 200కు పైగా స్కోరు వచ్చే అవకాశాలున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. అలాగే టాస్ కూడా కీలకం అవుతుందని భావిస్తున్నారు.

ఈనెల 24 జరిగిన తొలి మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై తొలుత బ్యాటింగ్ చేసిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ 209 పరుగుల స్కోరు చేసింది. ఆదివారం జరిగే మ్యాచ్‌లో తొలి బ్యాటింగ్ చేసే జట్టు ప్రత్యర్థులకు 250 పరుగుల వరకు లక్ష్యాన్ని నిర్దేశించే అవకాశాలున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ముమ్మర సాధన

కీలక మ్యాచ్‌లో తలపడేందుకు ఇరుజట్ల ఆటగాళ్లు శనివారం ముమ్మర సాధన చేశారు. ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లు ఐదు రోజులుగా సాధన కొనసాగించగా, శుక్రవారం సాయంత్రం నగరానికి చేరుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాళ్లు శనివారం ఒక్కరోజు సాధన చేసే అవకాశం లభించింది.

ప్రభావం చూపని టికెట్ల ధర

దాదాపు 25 వేలకుపైగా సీటింగ్ సామర్థ్యం కలిగిన స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్, లఖనవూ జట్ల మధ్య ఈ నెల 24న జరిగిన తొలి మ్యాచ్‌కు 70 శాతం వరకూ సీట్లు నిండాయి. అయితే ఆదివారం జరిగే మ్యాచ్‌కు క్రీడాభిమానులు ఆసక్తి కనబరచడంతో శనివారం సాయంత్రానికి రూ.ఆరు వేల టికెట్లు మినహా మిగిలినవన్నీ పూర్తిగా అమ్ముడైపోయాయి.

ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు (అంచనా): అక్షర పటేల్ (కెప్టెన్), మెక్‌గుర్క్, డుప్లెసిస్, అభిషేక్ పోరల్, సమీర్ రజ్వి, ట్రిస్టాన్ స్టబ్స్, అశుతోష్ శర్మ, విప్రాజ్ నిగమ్, మిచెల్ స్టార్క్, కులదీప్ యాదవ్, మోహిత్ శర్మ, ముకేష్‌కుమార్

సన్‌రైజర్స్ హైదరాబాద్ (అంచనా): కమిన్స్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, హెడ్, నితీష్‌కుమార్ రెడ్డి, ఇషాన్ కిషన్, హెన్రిచ్, అనికేత్ వర్మ, అభినవ్ మనోహర్, ఆడమ్ జంపా, సిమ్రజీత్ సింగ్, హర్షల్ పటేల్, మహ్మద్ షమి.

వైభవంగా నూకాంబిక ఉత్సవాలు



ప్రహ్లాదపురంలో పదివేల నెమలిపించాలతో అలంకరించిన నూకాలమ్మ

పెదగంట్యాడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కొత్త అమావాస్యను పురస్కరించుకుని శనివారం పలు ప్రాంతాల్లో నూకాంబిక ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 65వ వార్డు అశోక్‌నగర్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి పూజలు, అభిషేకాలు చేయగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు, వైసీపీ గాజువాక ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డిలు నూకాంబికకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బి.వెంకటస్వామిరెడ్డి, ఆనంద్, ఆచారి, మురళీమోహన్, తదితరులుపాల్గొన్నారు. అలాగే నడుపూరు ఆలయంలో 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు నూకాంబికను దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, 'జబర్దస్త్' ఫేమ్ సత్తిపండు బృందం ప్రదర్శించిన హాస్యవల్లరి ఆకట్టుకుంది.

అగనంపూడి: పాత అగనంపూడిలో నూకాంబికను నూతన వస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి పూజలు చేయగా గ్రామ పెదలతో పాటు అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధనను చేపట్టారు. అలాగే శనివాడలోని నూకాంబిక ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయగా పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించి అనుపోత్సవాన్ని నిర్వహించారు. కొండయ్యవలస వేపచేట్టు వద్ద, దానబోయినపాలెం నూకాంబిక ఆలయాల్లో అమ్మవారికి పూజలు జరిపారు.

గోపాలపట్నం: నూకాంబిక ఉత్సవాలను గోపాలపట్నం, కొత్తపాలెం, అప్పల నరసింహకాలనీ, వెంకటాపురం ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచే అమ్మవారి దర్శనార్థం భక్తులు ఆయా ఆలయాల వద్ద బారులుతీరారు. పోలీసులు బందోబస్తును పర్యవేక్షించారు. గోపాలపట్నం ప్రధాన రోడ్డులో రాత్రి ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వేపగుంట: ప్రహ్లాదపురంలోని నూకాంబిక ఆలయంలో అమ్మవారికి 108 కలశాలతో జలాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేయగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పది వేల నెమలిపించాలతో అందంగా అలంకరించారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తనయుడు అప్పలనాయుడు, కార్పొరేటర్ రాపర్తి కన్నాలు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే నాయుడుతోట గంగిరెడ్డికాలనీలో, గొల్ల నారాయణపురంలో, వరలక్ష్మీనగర్‌లోని నూకాంబిక ఆలయాల్లో పూజలు చేశారు.

ఎన్.ఎ.డీ జంక్షన్: సాకేతపురంలోని నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో కొత్త అమావాస్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

అక్కిరెడ్డిపాలెం: అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, తుంగ్లాం కాలనీల్లోని నూకాంబిక ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా ఆలయాల్లోని అమ్మవార్లను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పసుపుకుంకుమలతో పాటు మొక్కులు చెల్లించారు. వైసీపీ గాజువాక ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి, నాయకులు సంద్రాన నూకరాజు, కాద రాజు, రమణ, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మల్కాపురం: కొత్త అమావాస్యను పురస్కరించుకుని పారిశ్రామిక ప్రాంతంలోని నూకాంబిక ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక ఆలయాలకు విచ్చేసి నూకాలమ్మను దర్శించుకున్నారు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాలు సందడిగా కనిపించాయి.

నలుగురికి కళారత్న అవార్డులు

... 7వ పేజీ తరువాయి

సరస్వతి విద్యార్థి (కర్ణాటక వయలిస్ట్-సంగీతం),పాలగుమ్మి రాజగోపాల్ (సంగీతం) ఉన్నారు. ఉగాది పురస్కారం పొందిన వారిలో కుప్పిలి పద్మ (సాహిత్యం), శిరేల సన్యాసిరావు (సాహిత్యం), డాక్టర్ బండి సత్యనారాయణ (సాహిత్యం), గుంటుకు వెంకటరావు (సంగీతం), డాక్టర్ ఆముక్త మాల్యాద (నృత్యం), డి.హేమ వేంకటేశ్వరి (నాటకం), కొల్లాబత్తుల విజయకుమార్ (మిమిక్రీ), బీఆర్ విక్రమ కుమార్ (జర్నలిజం), కనపర్తి రాణి (జర్నలిజం), ఎం.విజయకుమార్ (పెయింటింగ్) ఉన్నారు.

దుశ్చర్య

... 7వ పేజీ తరువాయి

వాహనాల వద్ద హఠాత్తుగా మంటలు చెలరేగాయి. పెట్రోల్‌తో ఉన్న వాహనాలు కావడం, మంటలు పెద్దఎత్తున వ్యాపించడంతో అదే అపార్టుమెంట్ సెల్లార్‌లో ఆరుగురు సభ్యులతో నివసిస్తున్న కుటుంబం హాహాకారాలు చేసింది. మంటలు వారి ఇంటి లోపలకు కూడా వ్యాపించాయి. కుటుంబ సభ్యులు వెనుక వైపు నుంచి బయటకు వచ్చి ప్రాణాలు దక్కించుకున్నారు. ఇంట్లోని వస్తువులు మాడి మసయ్యాయి. సమాచారం అందుకుని అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సుమారు ఇరవై రోజుల క్రితం ఇదే అపార్టుమెంట్‌కు చెందిన ఒక యువకుడి వాహనాన్ని కొందరు తగులబెట్టారు. అతను నూతన వాహనం కొనుగోలు చేసి ఉగాది రోజు పూజ చేయించాలని అపార్టుమెంట్ పార్కింగ్‌లో పెట్టాడు. ఈ నేపథ్యంలో మళ్లీ ఆ యువకుడి వాహనాన్ని దహనం చేసేందుకు గుర్తుతెలియని వ్యక్తులు ప్రయత్నించి ఉంటారని, ఈ క్రమంలో వాహనాలన్నీ కాలిపోయి ఉంటాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు క్లూస్ టీమ్‌తో ఘటనా స్థలానికి వచ్చి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

నకిలీ బంగారంతో బురిడీ!

సైబర్ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

విశాఖపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లోని ఓ గోల్డ్ లోన్ సంస్థలో ఒకరు నకిలీ బంగారం తనఖా పెట్టి లక్షల రూపాయలు రుణం తీసుకున్నాడు. ఆ బంగారాన్ని అమ్మేస్తానంటూ మరొకరిని నమ్మించి గోల్డ్‌లోన్ సంస్థకు అతడితో డబ్బులు కట్టించి వస్తువులు విడిపించి అతనికిచ్చాడు. అతడు వాటిని పరిశీలించగా అవి నకిలీవిగా తేలడంతో ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివారాలివి. పెదగంట్యాడ బీసీ రోడ్డు దయాల్‌నగర్‌కు చెందిన పొదిలాపు జగదీశ్వరరావు బ్యాంక్‌లో తనఖా పెట్టిన బంగారం క్రయ విక్రయాలు చేస్తుంటాడు. బ్యాంక్‌లో పెట్టిన బంగారు ఆభరణాలు విడిపించలేకపోతే కమీషన్ తీసుకుని విడిపిస్తుంటాడు. ఈ క్రమంలో జగదీశ్వరరావు వద్దకు మార్చి 19న కర్రి గురుమూర్తి, త్రినాథ్ అనే వ్యక్తులు వెళ్లి తమ బంధువులు రూపిక్, కెనరా బ్యాంకులో బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టారని తెలిపారు. తమకు కొంత కమీషన్ ఇచ్చి తనఖా పెట్టిన బంగారాన్ని విడిపించాలని జగదీశ్వరరావును కోరారు. ఈ నేపథ్యంలో ద్వారకా నగర్‌లో గల రూపిక్ బ్యాంక్‌కు అతనిని తీసుకువెళ్లారు. అక్కడ వారి బంధువులు ఈశ్వరరావు, మోహనరావు, రాఘవేంద్ర, రాజు అనే వారు ఉన్నారు. తనఖా పెట్టిన బంగారు ఆభరణాలు ఇవ్వడానికి రూ.68,51,300 కట్టాలని రూపిక్ బ్యాంక్ మేనేజర్ వర్మ కోరారు. డబ్బులు చెల్లించే ముందు బంగారు ఆభరణాలు తనిఖీ చేయాలని జగదీశ్వరరావు అభ్యర్థించాడు. అయితే బంగారం రామ్‌నగర్‌లోని ఫెడరల్ బ్యాంక్ లాకర్‌లో ఉందని, డబ్బు మొత్తం చెల్లించకుండా ఆభరణాలు చూపించేది లేదని రూపిక్ బ్యాంక్ మేనేజర్ తెలిపారు. కెనరా బ్యాంక్ నుంచి టేకోవర్ లోన్ కాబట్టి బంగారం నిస్సందేహంగా స్వచ్ఛమైనదని అప్రైజర్ వివరించాడు. లేకుంటే దానిని రుణానికి పూచీకత్తుగా అంగీకరించేవారు కాదని తెలిపారు. ఈ క్రమంలో రూపిక్ బ్యాంక్ మేనేజర్ వర్మ బంగారు ఆభరణాలు విడిపించాలంటే మొత్తం రూ.68,51,300 జమ చేయాలన్నారు. దీంతో జగదీశ్వరరావు ఆ మొత్తాన్ని చెల్లించాడు. శనివారం సాయంత్రం రూపిక్ బ్యాంక్ సిబ్బంది పార్శిల్ కవర్‌తో వచ్చి దానిని వారికి ఇచ్చి వెంటనే వెళ్లిపోయారు. ఆ పార్శిల్ తెరిచి చూడగా అందులో నకిలీ బంగారం ఉన్నట్లు గ్రహించారు. వెంటనే జగదీశ్వరరావు తనను మోసం చేశారని, మంచి బంగారం ఉందని చెప్పి నకిలీది ఇచ్చారని గురుమూర్తి, త్రినాథ్, ఈశ్వరరావు, మోహనరావు, రాఘవేంద్ర, రాజులను నిలదీశాడు. నకిలీ బంగారమని తమకు తెలియదని వారు బదులిచ్చారు. దీంతో జగదీశ్వరరావు ద్వారకా పోలీసు స్టేషన్‌కు వెళ్లి తనను నకిలీ బంగారంతో మోసగించారని ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. సీఐ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలి

గాజువాక, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ మృతిపై లోతైన విచారణ జరపాలని గాజువాక పారిశ్రామిక ప్రాంత క్రైస్తవుల ఐక్య వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. గాజువాకలో శనివారం జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ ప్రవీణ్ మరణం క్రైస్తవ సమాజానికి తీరని లోటన్నారు. ప్రవీణ్ మృతిపై విచారణ చేపట్టి నిజానిజాలను బహిర్గతం చేయాలన్నారు. ప్రతినిధులు ఎ.రవిబాబు, పి.విజయ్‌కుమార్,డేవిడ్‌రాజు,శుభాకర్, తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే టీడీపీ లక్ష్యం

పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

తెలుగుదేశానిది ఎప్పుడూ ప్రజల పక్షమే: పార్టీ 'పెందుర్తి' ఇన్‌చార్జి గండి బాబ్జీ

పలుచోట్ల ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

గోపాలపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గోపాలపట్నంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే టీడీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీని స్థాపించిన అనతికాలంలోనే అపూర్వ ప్రజాదరణతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఘనత దివంగత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. పార్టీ స్థాపించిన 43 ఏళ్లలో రెండు దశాబ్దాల పాటు అధికారంలో ఉండడం టీడీపీపై ప్రజలకు ఉన్న విశ్వసనీయతకు నిదర్శనమని పేర్కొన్నారు. దేశ రాజకీయాలను శాసించే స్థాయికి పార్టీని తీసుకువెళ్లడంతో పాటు నేడు రాష్ట్రాన్ని అగ్రపథంలో నడిపేందుకు సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. తొలుత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గోపాలపట్నం నుంచి కంచరపాలెం వరకు పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెందుర్తి: అధికారంలో ఉన్నా.. లేకున్నా తెలుగుదేశం పార్టీ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పార్టీ 96వ వార్డు అధ్యక్షుడు వేగి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి గండి బాబ్జీ పూలమాల వేసి టీడీపీ పతాకావిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం చరిత్రాత్మకమన్నారు. చంద్రబాబు నాయకత్వంలో అన్నిరంగాల్లో ఏపీ నంబర్‌వన్‌గా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ రెడ్డి నారాయణరావు, నాయకులు కరక దేవుడు, కె.సుందరరావు, అవతారం, తదితరులు పాల్గొన్నారు. రాంపురంలో మాజీ జడ్పీటీసీ రెడ్డి నారాయణరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

గాజువాక: ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతుందని పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించాక ఆయన మాట్లాడుతూ టీడీపీ స్థాపించినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రజా సంక్షేమం విషయంలో రాజీ లేకుండా సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు విల్లా రామ్మోహన్‌కుమార్, కె.శ్రీనివాసవర్మ, ఎస్.అనంత్, టి.శివప్రసాద్, హరికృష్ణ, ఎ.లక్ష్మణరావు, ఉగ్రం, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే వంటిళ్ల జంక్షన్ వద్ద జరిగిన కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు బలగ బాలునాయుడు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


పాదయాత్రలో పాల్గొన్న గణబాబు, నాయకులు, కార్యకర్తలు


ఎన్టీఆర్ విగ్రహానికి నమస్కరిస్తున్న గండి బాబ్జీ, తదితరులు

కూర్మన్నపాలెం: సమాజమే దేవాలయం, ప్రజలే నా దేవుళ్లు అంటూ దివంగత ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారని 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ అన్నారు. కూర్మన్నపాలెం ఎన్టీఆర్ కూడలిలో ఆయన పార్టీ జెండాను ఆవిష్క రించి మాట్లాడారు. కార్యకర్తలే టీడీపీకి శ్రీరామరక్ష అని నమ్మే వ్యక్తి సీఎం చంద్రబాబు నాయుడు అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, కనకరాజు, గణపతి, జగదీశ్, నాగార్జున, సుబ్బయ్య, వెంకటేశ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే 87వ వార్డు వడ్లపూడిలో కార్పొరేటర్ బొండా జగన్ పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేశారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి టీడీపీ ఎనలేని కృషి చేస్తుందన్నారు. నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్ రాజు, రాంబాబు, అప్పారావు, కన్నారావు, ఎం.రాము, తదితరులు పాల్గొన్నారు. 88 వార్డు దువ్వాడ సెక్టార్-1లో కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు పార్టీ జెండాను ఎగురవేశాక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలే వేసి నివాళులర్పించారు. నాయకులు ఉరుకూటి శ్రీనివాస రావు, రాము, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా యాదవ జగ్గరాజుపేటలో టీడీపీ సీనియర్ నాయకుడు గొలగాని సన్యాసిరావు ఆధ్వర్యంలో, 71వ వార్డులో టీడీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు పప్పు రాజారావు ఆధ్వర్యంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవాలను నిర్వహించారు. కాగా టీడీపీ 70వ వార్డు ఇన్‌చార్జి, అధ్యక్షుడు చట్టి గోపి, కేవీఎస్ శంకరరావుల ఆధ్వర్యంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

పెదగంట్యాడ: ఇక్కడి హౌసింగ్ బోర్డు కాలనీ ఎన్టీఆర్ జంక్షన్ వద్ద ఎన్టీ రామారావు చిత్రపటానికి జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ప్రజల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. నాయకులు బి.అప్పారావు, టి.సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు. అలాగే 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు కాకతీయ జంక్షన్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే సీతానగరం కూడలిలో గల ఎన్టీఆర్ విగ్రహానికి 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి పూలమాల వేసి అంజలి ఘటించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, నాయకులు పి.పెద్దాడ నమ్మి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: ఇక్కడి టోల్‌గేట్ సమీపంలో గల ఫైలాన్ వద్ద గల ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమం కోసమే ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. నాయకులు గల్లా రాజు, కరణం పైడిరాజు, సత్యారావు, జగదీశ్, వెంకటరావు, ఎస్.సింహాచలం, తదితరులు పాల్గొన్నారు. మినీ జగదాంబ జంక్షన్, పెదమడక శివాలయం కూడలి వద్ద జరిగిన వేడుకల్లో టీడీపీ 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దశేంద్ర పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించడంతో పాటు ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అలాగే పెదమడకలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నెల్లి శ్రీనివాసరావు పుష్పమాల వేసి నివాళులర్పించారు.

మల్కాపురం: టీడీపీ 58వ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కోరమాండల్ గేటు దివంగత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే టీడీపీ లక్ష్యమని ఆయనన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: గ్రేటర్ 69వ వార్డు పరిధి వెంకటేశ్వర కాలనీలో ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ వార్డు అధ్యక్షుడు అలమండ రాజు పూలమాల వేసి నివాళులర్పించాక పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. నాయకులు శీరం రాజేశ్, వి.జీవన్‌బాబు, నిర్మలాకుమారి, ఆనంద్, వీరశంకర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే 68 వార్డు రామ్‌నగర్‌లో తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి, తదితరులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.


కూర్మన్నపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న 'నల్లూరు'

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

ఎన్టీఆర్‌కు నివాళులర్పించిన టీడీపీ నేతలు

విశాఖపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అధ్యక్షతన తొలుత పార్టీ జెండాను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్‌లు ఎగురవేశాక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమా వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగువారి గుండె చప్పుడు తెలుగుదేశం పార్టీ అని అభివర్ణించారు. తెలుగువారి ఆత్మ గౌరవం కోసం ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. సభ్యత్వ నమోదులో కోటి మార్కు దాటి టీడీపీ కొత్త రికార్డును సృష్టించిందని పేర్కొన్నారు. శ్రీభరత్ మాట్లాడుతూ ప్రజల కోసం, వారి అభ్యున్నతి కోసం అంకిత భావంతో పనిచేస్తూ దేశ రాజకీయ చరిత్రలో ప్రత్యేక అధ్యాయంగా టీడీపీ నిలిచిందన్నారు. టీడీపీకి కార్యకర్తలే మూలస్తంభాలన్నారు. యువ నాయకుడు లోకేశ్ నాయకత్వంలో పార్టీ మరింత ముందుకు వెళుతుందన్నారు. సీనియర్ కార్యకర్తలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ టీడీపీ వచ్చాకే బడుగు, బలహీన వర్గాలకు గుర్తింపు వచ్చిందన్నారు. గండి బాబ్జీ మాట్లాడుతూ దివంగత ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ దేశంలోనే చరిత్ర సృష్టించిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పార్టీ నేతలు పొలమరశెట్టి శ్రీనివాసరావు, వెల్లంకి భరత్, లొడగల కృష్ణ, ముత్యాలనాయుడు, పప్పు రాజారావు, ఈతలపాక సుజాత, తోట రత్నం, ఎ.మధుసూధనరావు, టి.విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పార్టీలో సీనియర్లయిన మందలపు వాసుదేవరావు, ఎస్.సుజాత, బి.వెంకటరమణ, ఎస్.రామారావు, ఎం.దేవుళ్లు, పి.నాగేశ్వరరావు, కె.వెంకటరావు, ఈసరపు వాసుదేవరావు, టి.చినదేముడు, వి.మోహనరావు, సీహెచ్ అప్పారావు, జె.కన్నబాబు, ఆర్.నారాయణ, ఎం.నిర్మలకుమారి, ఎస్.ఉమామహేశ్వరరావులను ఘనంగా సత్కరించారు.

గ్రేటర్ బడ్జెట్ రూ.4,601.4 కోట్లు

... 7వ పేజీ తరువాయి

ముగియాల్సిన బడ్జెట్ సమావేశాన్ని ఇంతవరకూ నిర్వహించకపోవడానికి కారణం చెప్పాలని డిమాండ్ చేశారు. దీనికి అదనపు కమిషనర్ (ఫైనాన్స్) ఎస్.ఎస్.వర్మ సమాధానం ఇస్తూ జనవరి మొదటి వారంలో నిర్వహించాలకున్నప్పటికీ...పీఎం నరేంద్రమోదీ పర్యటన, ఆ తరువాత కమిషనర్ బదిలీ, ఎమ్మెల్సీ ఎన్నిక కోడ్ వంటి కారణాలతో సాధ్యపడలేదని వివరించారు. దీనికి జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ స్పందిస్తూ బడ్జెట్ సమావేశం నిర్వహించడంలో విఫలమైనందుకు నైతిక బాధ్యత వహిస్తూ మేయర్ గొలగాని హరివెంకటకుమారి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అందుకు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సమాధానం ఇస్తూ రాష్ట్రంలోనే అతిపెద్ద కార్పొరేషన్‌గా గుర్తింపుపొందిన జీవీఎంసీకి రెండు నెలలుగా కమిషనర్‌ను నియమించలేకపోయారని, దీనికి బాధ్యత వహిస్తూ టీడీపీ కార్పొరేటర్లు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై సభలో టీడీపీ సభ్యులు తీవ్రస్థాయిలో అభ్యంతరం తెలపడంతో గందరగోళం ఏర్పడింది. అదే సమయంలో ఇన్‌చార్జి కమిషనర్ హోదాలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ కౌన్సిల్‌హాల్‌లోకి రావడంతో సభ్యులంతా ఎవరి స్థానాల్లో వారు కూర్చున్నారు. అనంతరం మేయర్ హరివెంకటకుమారి బడ్జెట్ ముసాయిదాలోని అంశాలు, జీవీఎంసీకి వివిధ మార్గాల ద్వారా వచ్చే ఆదాయం అంచనాలతోపాటు వివిధ విభాగాల ద్వారా చేసే ఖర్చులకు సంబంధించిన వివరాలను చదివి వినిపించారు. ఈ దశలో సీపీఐ కార్పొరేటర్ ఏజే స్టాలిన్ మాట్లాడుతూ బడ్జెట్ కేటాయింపుల్లో విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేశారని అసంతృప్తి వ్యక్తంచేశారు. సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు మాట్లాడుతూ బడ్జెట్‌ను పూర్తిగా అంకెలతో నింపేశారని, వాస్తవ ఆదాయం, ఖర్చులను పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. గత ఏడాది బడ్జెట్ కంటే గరిష్ఠంగా 20 శాతం మించి బడ్జెట్ అంచనాలు ఉండకూడదనే విషయాన్ని స్టాండింగ్ కమిటీ విస్మరించడం సరికాదన్నారు. ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ సమాధానం ఇస్తూ బడ్జెట్‌ను అంచనాల ఆధారంగానే రూపొందిస్తామని, ముందుగా తయారుచేసిన ముసాయిదాలో మరింత ఎక్కువ మొత్తం చూపించడంతో రూ.865 కోట్లు తగ్గించి ప్రస్తుత బడ్జెట్‌ను రూపొందించామని వివరించారు. 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత బడ్జెట్‌లో క్రీడలకు కేవలం రూ.15 కోట్లు మాత్రమే కేటాయించారని, ఆ మొత్తంతో నగర పరిధిలో క్రీడలను అభివృద్ధి చేయడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస్ మాట్లాడుతూ బడ్జెట్ గురించి మేయర్‌కు సరైన బాధ్యత లేకుండా పోయిందన్నారు. ముడసర్లోవలోని గుర్రాలపార్కు అంటే ఏదో బొమ్మలు పెడతారనుకుని కాంట్రాక్టర్‌కు రూ.3.5 కోట్లు చెల్లించేందుకు సంతకం చేసేశానని అంటారని ఎద్దేవా చేశారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జీవీఎంసీ ఆదాయాన్ని జీవీఎంసీయే ఖర్చు పెట్టుకునేందుకు వీలుగా సీఎఫ్ఎంఎస్‌ను పూర్తిగా రద్దు చేశారన్నారు. జీవీఎంసీ అభివృద్ధికి తోడ్పలేలా నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబుని అభినందిస్తూ కౌన్సిల్ తీర్మానం చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో సీఎఫ్ఎంఎస్‌లో రూ.170 కోట్లు, రిజిస్ట్రేషన్లపై సర్‌చార్జీల కింద రూ.110 కోట్లు ఇతర ప్రాజెక్టుల కింద రావాల్సిన బకాయిలు కలిపి రూ.570 కోట్లు ఉండిపోతే...వాటి విషయంలో కూటమి ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ తన కోటాలో త్వరలోనే రూ.పది కోట్లు నిధులు వస్తాయని, వాటిని నగర పరిధిలోనే ఖర్చు చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాల నిర్వహణలో జిల్లా కలెక్టర్ చట్టాన్ని పాటించడం లేదని, తనకు కనీసం నోటీసు కూడా ఇవ్వకుండానే సమావేశం పెట్టడం సరికాదన్నారు. తనకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సమాధానం ఇస్తూ చట్టబద్ధమైన కమిటీల సమావేశం పార్లమెంటు సమావేశాలతో నిమిత్తం లేకుండా నిర్వహించుకోవచ్చునన్నారు. తమ అధికారులు సమావేశానికి ఆహ్వానం పంపించినా, స్పందించలేదని వివరించారు. ప్రతిరోజూ ఉదయం తొమ్మిదిన్నర నుంచి రాత్రి తొమ్మిదిన్నర వరకు తాను కార్యాలయంలోనే ఉంటున్నానని, అపాయింట్‌మెంట్ లేకుండానే కలిసే వెసులుబాటు ఉంది కాబట్టి, ఎప్పుడైనా, ఎవరైనా వచ్చి కలవచ్చునన్నారు.

నగరాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలి

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేశ్‌కుమార్

విశాఖపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగర అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై జీవీఎంసీ పాత కౌన్సిల్‌హాల్‌లో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ జీవీఎంసీలో వివిధ విభాగాల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సేవలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్, అన్న క్యాంటీన్ల నిర్వహణ, యూసీడీ ద్వారా ప్రజలకు అందజేస్తున్న పథకాలను వివరించారు. అనంతరం సురేశ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సేవలతోపాటు మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాలు అమలుకు ప్రభుత్వం 'పురమిత్ర' యాప్‌ను అభివృద్ధి చేసిందని, దీనిద్వారా ప్రజలు సులభంగా తమకు అర్హత కలిగిన పథకాలను పొందే పరిస్థితిని కల్పించాలని ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పూర్తయిన టిడ్కో ఇళ్లలో లబ్ధిదారులు నివాసముండేలా చూడాలన్నారు. సమీక్షలో వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, ఏడీసీలు, తదితరులు పాల్గొన్నారు.





డ్రా తీసిన కూపన్లు చూపుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, 'ఐకానిక' మార్కెటింగ్ హెడ్ అవినాశ్‌వర్మ



అక్కయ్యపాలెంలోని 'ఆంధ్రజ్యోతి' కార్యాలయంలో డ్రా తీసేముందు లక్కీడ్రా కూపన్లను కలుపుతున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి

కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రా విజేతలు వీరే...

విశాఖపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి):

'ఆంధ్రజ్యోతి' 'కార్ అండ్ బైక్ రేస్' లక్కీడ్రా కార్యక్రమం శనివారం సాయంత్రం విశాఖపట్నంలోని యూనిట్ కార్యాలయంలో జరిగింది. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ, 'సీఎంఆర్' గ్రూపుల అధినేత మావూరి వెంకటరమణ, 'ఐకానిక' ప్రాజెక్ట్సు మార్కెటింగ్ హెడ్ అవినాష్‌వర్మలు ముఖ్య అతిథులుగా హాజరై డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేశారు. వారి వివరాలు...

ప్రథమ బహుమతి : వీవీఎస్ మోహిత్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం

ద్వితీయ బహుమతి : బి.గోవిందసింగ్, రాజీవ్‌నగర్, కూర్మన్నపాలెం, విశాఖపట్నం

తృతీయ బహుమతి : బళ్ల శివసుందరరావు, సెక్టార్-5, ఎంవీపీ కాలనీ, విశాఖపట్నం

యూనిట్ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా మోటార్ బైక్, రిఫ్రిజిరేటర్, స్మార్ట్ టీవీ అందిస్తుంది. మరో వంద మందికి కన్సొలేషన్ కింద రెండు వేల విలువైన బహుమతులు ఇవ్వనున్నారు.

కన్సొలేషన్ బహుమతుల విజేతలు వీరే..

1. ఎంకే వెంకటేశ్వరరావు, తగరపువలస
2. అనకాపల్లి ద్రాక్షాయణి, గాంధీనగర్, అనకాపల్లి
3. దన్నాన నారాయణరావు, పీఎం పాలెం
4. నడింపల్లి సోమరాజు, తిమ్మాపురం
5. జి.మౌళి, కొమ్మాది
6. జీవీ సత్యనారాయణ, ములిపాక, మునగపాక
7. వై.శ్రీనివాసరావు, వేములవలస
8. వై.సన్యాసిరావు, ఎం.వి.పి.కాలనీ
9. జీఎస్ శివప్రకాశ్, మద్దిలపాలెం
10. దాడి హాసిని, గోవాడ, చోడవరం
11. ఎన్.వెంకట సిద్ధార్థ, ప్రహ్లాదపురం
12. పప్పు విజయలక్ష్మి, కృష్ణరాయపురం
13. జనపాన శ్రావణి, మధురవాడ
14. జిలక్ష్మి కనకదుర్గ, సుజాతానగర్
15. పీవీవీఎస్ఎన్ మూర్తి, ఎలమంచిలి
16. జి.వెంకటలక్ష్మి, ఆరిలోవ
17. బి.అనంతవంశీ, సీతంపేట
18. ఇయ్యపు జోగి, గొల్లలపాలెం, కొత్తవలస
19. కోడూరు సత్యనారాయణ, పాడేరు
20. ఎం.కృష్ణవేణి, తగరపువలస
21. బీఎస్ కళ, కేఆర్ఎం కాలనీ
22. టీఎస్‌వీఎస్ శివ, గోపాలపట్నం
23. ఎస్‌వీ రమణ, టీపీటీ కాలనీ
24. బి.లక్ష్మణరావు, అనకాపల్లి
25. ఎస్‌కే జరీనా, రవీంద్రనగర్
26. వి.సుబ్రహ్మణ్యం, కేఆర్ఎం కాలనీ
27. జి.దివ్యేశ్, గోపాలపట్నం
28. డి.శ్యామ్‌సుందర్, ఎండాడ
29. వి.దివ్య సీతాలక్ష్మి, కేఆర్ఎం కాలనీ
30. బి.ధనుంజయనాయుడు, శివాజీపాలెం
31. జి.కీర్తికుమారి, ఆర్ఆర్‌వీ పురం
32. జి.విజయలక్ష్మి, మాధవదార
33. పి.నవనీత్, మర్రిపాలెం
34. గుండు హరనాథరావు,నాయుడుతోట
35. ఎస్.శ్రీహరి, కరాస
36. బి.రమేశ్‌చౌదరి, కూర్మన్నపాలెం
37. బి.త్రివేణి, మహారాణిపేట
38. ఎన్‌జీ సాగరిక, కప్పరాడ
39. జి.రామకృష్ణ, శ్రీనగర్
40. జి.సంజీవని, బర్మా కాలనీ
41. వీఎస్ ప్రియాంక, కైలాసపురం
42. జి.పద్మ, సీబీఎం కాంపౌండ్
43. పి.విజయ్‌కుమార్, మాధవదార
44. బీఎస్ రావు, రాజేంద్రనగర్
45. జీవీ లక్ష్మి, మాధవదార, వుడా కాలనీ
46. బీవీ లక్ష్మి, సీతమ్మధార
47. పప్పు గణేశ్వరరావు, లంక ధర్మవరం
48. జి.విజయలక్ష్మి, అబీద్‌నగర్
49. ఎన్.బాలకృష్ణ, కొత్తూరు, సబ్బవరం మండలం
50. ఎం.రామారావు, ఎలమంచిలి
51. ఎం.సన్యాసిరావు, అనకాపల్లి
52. కొప్పరపు సద్గుణరావు, ఆరిలోవ
53. కొమర ప్రదీప్‌కుమార్, సబ్బవరం
54. పి.కల్యాణి, సంగివలస
55. ఎం.వరహాలు, వుడ్ పేట, అనకాపల్లి
56. మండా సూర్యాబాయ్, సింహాచలం
57. టంగటూరి సత్యనారాయణ, గాజువాక
58. బి.శ్రీనివాస్, రైల్వే న్యూకాలనీ
59. బుగత శ్రీనివాసరావు, మద్ది, పద్మనాభం
60. పి.మణికంఠ అజయ్, గోపాలపట్నం
61. మహాలక్ష్మి ఫ్యూయల్ నీడ్స్, అచ్యుతాపురం
62. ఎస్.ధనలక్ష్మి, రాజేంద్రనగర్
63. సరిపల్లి శ్రీకాంత్, పెందుర్తి
64. ఎస్.తులసి, కంచరపాలెం
65. పెదపాటి ప్రకాశరావు, నర్సీపట్నం
66. వర్ధన్, ఓల్డ్ శారదానగర్, అనకాపల్లి
67. పి.కృష్ణమాచార్యులు, పెదగంట్యాడ
68. ఎం.మధుకర్, ఎం.వి.పి.కాలనీ, విశాఖ
69. బి.నర్సింహమూర్తి, బుచ్చిరాజుపాలెం
70. ఆర్.మురళీధరరావు, వేపగుంట, విశాఖ
71. సీహెచ్ శ్రీనివాసరావు, చందనపురి కాలనీ
72. కె.గాయత్రి, పెందుర్తి
73. బి.వరలక్ష్మి, కృష్ణానగర్, విశాఖ
74. బి.వెంకటరామయ్య, మురళీనగర్, విశాఖ
75. వి.వెంకటరెడ్డి, విశాలాక్షినగర్, విశాఖ
76. సీహెచ్ రమాదేవి, సింహాచలం
77. పి.అప్పారావు, ఎలమంచిలి
78. బి.శివశంకర ప్రసాద్, అనకాపల్లి
79. సుంకరి చిన్నారావు, ఎలమంచిలి
80. నీలి అప్పారావు, కొమ్మాది, విశాఖ
81. ఆడారి నాగేశ్వరరావు, మునగపాక
82. రాళ్లపల్లి నారాయణరావు, కశింకోట
83. వి.ఇంద్రావతి, భీమిలి
84. బి.వాసుబాబు, కూర్మన్నపాలెం
85. దండేపల్లి రామలక్ష్మి, నర్సీపట్నం
86. ఎస్‌కే సమీరా సుల్తానా, గొల్ల కంచరపాలెం
87. ఆర్.లక్ష్మి, మధురవాడ, విశాఖ
88. ఎస్.సురేశ్, సీబీఎన్ కాంపౌండ్, విశాఖ
89. ఎం.మహాలక్ష్మి, ఎన్‌జీవో కాలనీ, విశాఖ
90. చల్లా శివరామకృష్ణ, గాజువాక
91. ఎం.రామారావు, ఎలమంచిలి
92. మళ్ల గణేశ్వరరావు, ఎలమంచిలి
93. ఎస్.బ్రహ్మేశ్వరి, పాయకరావుపేట
94. డి.సారథి, రామాలయం వీధి
95. ఎల్.గోవిందకుమార్, సుజాతానగర్
96. యు.దత్త జగ్గారావు, చెట్టుపల్లి
97. ఎస్‌కే శిరాజుద్దీన్, నాయుడుతోట
98. వై.రమ్య, గొలుగొండ
99. పడాల సాయికుమార్, ఎలమంచిలి
100. బి.ప్రసాద్, రాజేంద్రనగర్

మూడేళ్లుగా 'ఆంధ్రజ్యోతి'ని చదువుతున్నాం

- వి.నవీన్‌కుమార్, విశాఖపట్నం (వీవీఎస్ మోహిత్, ప్రథమ బహుమతి విజేత తండ్రి)

మేం అక్కయ్యపాలెంలోని ఎస్ఎస్ఆర్ రెసిడెన్సీలో ఉంటున్నాం. గత మూడేళ్లుగా ఆంధ్రజ్యోతి పేపరును చదువుతున్నాం. ఇందులో అన్ని పేపర్ల కంటే భిన్నమైన వార్తలు వస్తుంటాయి. లోకల్ వార్తలు చదివేందుకు ఎక్కువ ఆసక్తి చూపిస్తుంటాం. రాజకీయ కథనాలు బాగుంటాయి. ప్రతి పేజీలోనూ వచ్చే వార్తలు ఎంతో బాగుంటాయి. ఇప్పటికి రెండోసారి కూపన్లు పంపాం. రెండో ప్రయత్నంలోనే ప్రథమ బహుమతి సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. లక్కీ డ్రాలో బైకు వచ్చినట్టు చెప్పడంతో మా ఆనందానికి అవధులు లేవు.

15 ఏళ్లుగా 'ఆంధ్రజ్యోతి' పాఠకుడిని..

- బి.గోవింద్‌సింగ్, ద్వితీయ బహుమతి విజేత, విశాఖ

పదిహేనేళ్ల నుంచి ఆంధ్రజ్యోతి పత్రిక చదువుతున్నాం. పేపర్ మొత్తం పూర్తిగా చదవడాన్ని నాతో పాటు ఇంట్లోని ఆడవాళ్లు కూడా అలవాటు చేసుకున్నారు. గత మూడు, నాలుగేళ్లుగా కూపన్లు పంపుతున్నా. ఈసారి ద్వితీయ బహుమతి వచ్చిందని ఫోన్ చేసి చెప్పడంతో ఎంతో ఆనందమేసింది. దీనిని 'ఆంధ్రజ్యోతి' పాఠకుడిగా నాకు లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నా.

'కొత్త పలుకు' తప్పకుండా చదువుతా

- బళ్ల శివ సుందరరావు, ఎంవీపీ కాలనీ, విశాఖ

ఎంకే బిల్డర్స్‌లో పర్చేజింగ్ మేనేజర్‌గా చేస్తున్నాను. పది సంవత్సరాలుగా ఆంధ్రజ్యోతి పత్రిక చదువుతున్నా. టీవీలో వార్తల కోసం ఏబీఎన్ చానల్‌నే చూస్తాంటాం. పత్రికను ఉదయం పూర్తిగా చదివాకే బయటకు వెళతాను. మెయిన్ మొదటి రెండు, మధ్య పేజీల్లో అన్నీ చదువుతాను. నా భార్య కూడా మొదటి పేజీ, సినిమా పేజీ తప్పకుండా చదువుతుంది. నవ్యలో వచ్చే కథనాలు ఎంతో ఆసక్తికరంగా ఉంటాయి. 'కొత్త పలుకు' ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. అందువల్ల ప్రతివారం మిస్ కాకుండా చదువుతుంటా.

ఐపీఎల్ సందడి



ఎంపీ శ్రీభరత్ కుటుంబ సభ్యులు, నారా లోకేశ్ కుమారుడు దేవాన్ష్



దేవాన్ష్ బ్యాటింగ్



ఇషాన్ కిషన్ బ్యాటింగ్




అశుతోష్ శర్మ, అక్షర్ పటేల్ బ్యాటింగ్ ప్రాక్టీస్



డుప్లెసిస్‌తో దేవాన్ష్




నితీష్‌కుమార్‌రెడ్డి బ్యాటింగ్



అమెరికా బృందంతో సమావేశమైన పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేశ్‌కుమార్ దుబే

విశాఖ పోర్టును సందర్శించిన అమెరికా బృందం

విశాఖపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు అథారిటీని శనివారం అమెరికా ప్రతినిధి బృందం సందర్శించింది. యునైటెడ్ స్టేట్స్ నేవీ కెప్టెన్ అలన్ ఎం బేకర్ నేతృత్వంలోని అమెరికా ప్రతినిధి బృందానికి పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేశ్‌కుమార్ దుబే సాదరంగా స్వాగతించారు. అనంతరం వారితో సమావేశమై పోర్టులో అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, కార్గో నిర్వహణ, సామర్థ్యాలు, ఆధునికీకరణ, యాంత్రీకరణ, కవర్డ్ స్టోరేజీ సదుపాయాలు, సోలార్ పవర్, పారిశ్రామిక అవసరాల కోసం ఎస్‌టీపీ వాటర్ ట్రీట్‌మెంట్, పెట్టుబడులకు గల అవకాశాలు, భారత్-అమెరికాల మధ్య పోర్టు ద్వారా వాణిజ్య సంబంధాల ప్రాధాన్యం గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అమెరికా బృందానికి వివరించారు. విశాఖ పోర్టులో గల ఫ్రీట్రేడ్ జోన్, క్రూయిజ్ టూరిజం, వంటి అవకాశాలను వినియోగించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో పోర్టు విభాగాధిపతులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ ఉక్కు ఆస్పత్రిలో పాక్షికంగా వైద్య సేవలు

ఏప్రిల్ 1 నుంచి అమలు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 29 (ఆంధ్ర జ్యోతి): పెదగంట్యాడలోని ఉక్కు ఆస్పత్రిలో వైద్య సేవలు ఇకపై పాక్షికంగా అందనున్నాయి. సిబ్బంది కొరత కారణంగా ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఆస్పత్రిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మళ్లీ 3.30 గంటల నుంచి రాత్రి ఏడు వరకు మాత్రమే వైద్య సేవలు అందనున్నాయి. సెలవు రోజుల్లో మినహా మిగతా అన్ని దినాల్లో వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని, అత్యవసరమైతే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఉక్కు జనరల్ ఆస్పత్రికి వెళ్లాలని యాజమాన్యం సూచించింది. కాగా దీనిపై కార్మిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీఆర్ఎస్ ద్వారా సిబ్బందిని తగ్గించడంతో ఈ పరిస్థితి నెలకొందని కార్మిక నాయకులు ఆరోపిస్తున్నారు.

నౌపడ-గుణుపూర్ సెక్షన్‌లో రైల్వే జీఎం పర్యటన



పర్యటిస్తున్న తూ.కో రైల్వే జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్, డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తా రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ శనివారం వాల్తేరు డివిజన్ పరిధిలోని నౌపడ-గుణుపూర్ సెక్షన్‌లో పర్యటించారు. పర్లాఖెముండి స్టేషన్‌లో అమృత భారత్ పథకం కింద జరుగుతున్న నిరీక్షణ గదులు, మరుగుదొడ్లు, వాటర్ బూత్‌లు, సీటింగ్ ఏర్పాటు, రైల్వే కార్యాలయాలు, 12 మీటర్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జి వంటి అభివృద్ధి పనులను పరిశీలించారు. అక్కడ నుంచి గుణుపూర్ స్టేషన్‌కు చేరుకుని వివిధ అభివృద్ధి ప్రాజెక్టు పనులను సమీక్షించారు. ప్రయాణికుల సౌకర్యార్థం భవిష్యత్తు మౌలిక సదుపాయాల అభివృద్ధిపై స్థానిక అధికారులతో చర్చించారు. నౌపడ-గుణుపూర్ సెక్షన్‌లో వేగం, ఇతర సామర్థ్యం అభివృద్ధి చేయడానికి అవసరమైన ప్రణాళికలపై సమీక్షించారు. ఈ పర్యటనలో డీఆర్ఎం లలిత్ బొహ్రా, జోనల్, డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు
- వెంకోజీపాలెం వద్ద ప్రమాదం



రోడ్డు ప్రమాదంలో నుజ్జయిన ద్విచక్రవాహనం

ఎంవీపీ కాలనీ, మార్చి 29 (ఆంధ్ర జ్యోతి) : అతి వేగం ఒకరి ప్రాణం తీసింది. ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధి వెంకోజీపాలెం వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదానికి సంబంధించి, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని ఫిషింగ్ హార్బర్ ఫైందూర్‌పేటకు చెందిన పిల్లా పైడిరాజు (24) చేపల వేట జీవనోపాధిగా జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం మిత్రుడు పిల్లా చంటితో కలసి ద్విచక్రవాహనంపై భీమిలి నూకాలమ్మ పండుగకు వెళ్లారు. అర్ధరాత్రి తర్వాత తిరిగి వారు నగరానికి బయలుదేరారు. పిల్లా చంటి ద్విచక్ర వాహనాన్ని వేగంగా నడుపుతూ, వెంకోజీపాలెం వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి, డివైడరు గ్రిల్‌కు బలంగా ఢీకొనడంతో వెనుక కూర్చున్న పిల్లా పైడిరాజు కింద పడిపోగా.. తలకు దెబ్బ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన చంటిని ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. మృతుడు పైడిరాజు తల్లి నూకమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం... crime news

అత్తమామలను హతమార్చేందుకు యత్నం

- రూ.లక్షకు సుపారీ కుదుర్చుకున్నా పని పూర్తి కాకపోవడంతో నేరుగా రంగంలోకి..
- సీపీకి వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసిన బాధితులు
- నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్న సౌత్ ఏసీపీ టి.త్రినాథ్



విలేకరుల సమావేశంలో సౌత్ ఏసీపీ త్రినాథ్, సీఐ మల్లేశ్వరరావు

కూర్మన్నపాలెం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అత్తమామలను హతమార్చేందుకు కుట్రపనిన అల్లుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అగనంపూడికి చెందిన ఉక్కు ఉద్యోగి చల్లంగి సూర్యనారాయణ, సరస్వతి కుటుంబంతో ఉంటున్నారు. సూర్యనారాయణ కుమార్తె మౌనికను గాజువాక సమీపంలోని గొంతినవానిపాలేనికి చెందిన కరణం శ్రీనివాస్ ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. అయితే శ్రీనివాస్, మౌనికల మధ్య మనస్పర్థలు రావడంతో శ్రీనివాస్‌పై గాజువాక పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టారు. మౌనిక తల్లిదండ్రుల వద్దే ఉంటుంది. కాగా తన మూడేళ్ల కుమారుడిని భార్య చూడనివ్వడం లేదని, ఇంటికి కూడా రానివ్వడం లేదని.. ఇందుకు కారణం అత్తమామలేనని వారిపై శ్రీనివాస్ పగ పెంచుకున్నాడు. ఈ క్రమంలో అత్తమామలను హత మార్చేందుకు లక్ష రూపాయలకు సుపారీ కుదుర్చుకుని రూ.30 వేలు అడ్వాన్స్ కూడా ఇచ్చాడు. అత్తమామలు మృతి చెందితే భార్య, కుమారుడు తన వద్దకు రావడంతో పాటు వారి ఆస్తి కూడా వస్తుందని భావించాడు. అయితే అడ్వాన్స్ తీసుకున్న వ్యక్తులు పని పూర్తి చేయకపోవడంతో తానే చంపాలని ఈ నెల 26వ తేదీ రాత్రి విధులకు వెళ్లి వస్తున్న సూర్యనారాయణను బైకుతో ఢీకొని చంపేందుకు శ్రీనివాస్ విఫల యత్నం చేశాడు. స్థానికులు పట్టుకునేలోగా తప్పించుకుని పారిపోయాడు. దీంతో సూర్యనారాయణ, సరస్వతిలు సీపీ శంఖబ్రత బాగ్చీకి వాట్సాప్ (సెల్ నంబర్ 7995095799) ద్వారా ఫిర్యాదు చేశారు. అందుకు తక్షణమే స్పందించిన ఆయన ఏసీపీ త్రినాథ్‌కు, దువ్వాడ సీఐ మల్లేశ్వరరావుకు సమాచారం అందించి సూర్యనారాయణ, సరస్వతిలకు రక్షణ కల్పించారు. ఈ మేరకు పోలీసులు విచారణ జరిపి శనివారం శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే నిందితుడు ఎవరితో సుపారీ కుదుర్చుకున్నాడో దర్యాప్తు ద్వారా తెలుసుకుంటామని ఏసీపీ త్రినాథ్ తెలిపారు. సమావేశంలో సీఐ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.